ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5 వరంగల్
మంగళవారం 9 ఏప్రిల్ 2024

ప్రజలకు ఉగాది శుభాకాంక్షలు..

▸▸ రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ



వరంగల్ కల్చరల్, ఏప్రిల్ 8: ప్రజలందరు షడ్రుచుల సమ్మేళనం ఉగాది పచ్చడిని ఆస్వాదిస్తూ ఉగాదికి స్వాగతం పలకాలని, ప్రజలందరూ శుభ సంతోషాలతో, సిరి సంపదలతో ఉండాలని రాష్ట్ర దేవాదాయ, ధర్మాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉగాది ఆగమనం వసంత రుతువులోకి ప్రవేశించే సందర్భంగా ప్రజలందరికీ ఉగాది శుభాకాంక్షలని తెలిపారు.

రంజాన్ వేళలు

ఇఫ్తార్ :	మంగళవారం	సా : 6.36 గం..
సహర్ :	బుధవారం	ఉ : 4.40 గం..



శ్రీకరం.. శ్రీక్రోధి.

▪ నేడు ఉగాది పర్వం



- ▸▸ పంచాంగ శ్రవణాలకు ఏర్పాట్లు
- ▸▸ కవి సమ్మేళనాలు, ఆలయాల్లో పూజలకు సన్నద్ధం
- ▸▸ పూజా సామగ్రి కొనుగోళ్లతో మార్కెట్లు కిటకిట



వరంగల్ చౌరస్తాలో పూజా సామగ్రి అమ్మకాలు

సోమవారం ఉష్ణోగ్రతలు
గరిష్ఠం : 37.5°C
కనిష్ఠం : 25.0°C

వరంగల్ కల్చరల్, ఏప్రిల్ 8: తెలుగు సంవత్సరాది ఉగాది వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించుకునేందుకు జిల్లా వాసులు సిద్ధమయ్యారు. చైత్రశుద్ధ పాడ్యమితో కొత్త సంవత్సరం ప్రారంభమవుతుంది. ఉగాది పర్వదినం సందర్భంగా దేవాలయాల్లో ప్రత్యేక పూజలు, దర్శనాలు, సాయంత్రం వేళ పంచాంగ శ్రవణాలు, కవి సమ్మేళనాలు నిర్వహించేందుకు నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు చేశారు. ఉగాది వేళ పండితులతో జాతకాలను చూపించుకోవడం ఆనవాయితీ వస్తోంది. షడ్రుచులతో పచ్చడి తయారు చేసుకొని, నోరూరించే బొబ్బట్లును ఆరగించి పండుగను ఆనందంగా జరుపుకోనున్నారు.

కవి సమ్మేళనాలు, జాతకాలు..

ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకొని సాహిత్య రంగంలో నిష్ణాతులైన వారు కొత్త సంవత్సరం సందర్భంగా పద కవితలతో కవి సమ్మేళనాలను నిర్వహిస్తారు. కొన్ని చోట్ల ప్రభుత్వం అధికారికంగా నిర్వహించడంతోపాటు పలు చోట్ల సాంస్కృతిక సంస్థల ఆధ్వర్యంలో మంగళవారం సాయంత్రం కవి సమ్మేళనాలను నిర్వహించడానికి ఏర్పాట్లు చేస్తున్నారు. ఉగాది సందర్భంగా కొత్త పంచాంగం రావడంతో ప్రజలు తమ జాతక ప్రభావం రాశుల ఫలితాలు ఎలా ఉన్నాయనే తెలుసుకోవడానికి పండితుల వద్దకు వెళ్లి పంచాంగాన్ని ఫలితాలను తెలుసుకుంటారు.

షడ్రుచులతో పచ్చడి..

ఉగాది అంటే కొత్త కుండ, లేదంటే రంజన్‌లో కొత్త చింతపండు, బెల్లం లేదా చక్కర, మామిడి పిందె, వేప పూవ్వు, కారం, ఉప్పును కలిపి ఉగాది పచ్చడిని తయారు చేస్తారు. తర్వాత పచ్చడిని దేవుడికి నైవేద్యంగా నివేదన చేసి ఆరగిస్తారు. పండుగలో బొబ్బట్లు, భక్షాలను తయారు చేసుకోవడం అనాదిగా వస్తున్న ఆచారం. తీపి ఆనందానికి.. ఆశావాదానికి సంకేతం. అనారోగ్యాలను నివారించే శక్తి బెల్లంకు ఉంటుంది. పులుపు అంటే జీర్ణశక్తి పెంచడానికి, అవరోధాలకు ప్రతీక, కారం రుచితోపాటు మనలోని అంతర్లీనశక్తిని సమానంగా ఉంచేందుకు సూచిక. చేదు జీవితంలో

▸▸ మిగతా 8వ పేజీలో..

శ్రీక్రోధి నామ సంవత్సరం ..

ఉగాది నుంచి రేవతి ఉపరి అశ్విని నక్షత్రంలో శ్రీక్రోధి నామ సంవత్సరం ప్రారంభం కానుంది. 1946 మార్చి 22న వచ్చిన క్రోధినామ సంవత్సరం 9 ఏప్రిల్ 2024న మళ్లీ ప్రారంభమవనుంది. ఉగాది రాకను పురస్కరించుకొని ఆలయాల్లో రాశిఫలాలు, జిల్లా, రాష్ట్ర, దేశ పరిస్థితులపై పంచాంగ శ్రవణం, వారివారి రాశులపై ఈ ఏడాదిలో కలిగే ఫలితాలను వివరించే పంచాంగ శ్రవణాలు నగరంలో, జిల్లాలో ఏర్పాటు చేశారు. వరంగల్‌లోని శ్రీచారిత్రక శ్రీభద్రకాళి అమ్మవారి ఆలయంలో, వాసవీ క్లబ్ వారి ఆధ్వర్యంలో, ఇతర ధార్మిక సేవా సంస్థల ఆధ్వర్యంలో పంచాంగ శ్రవణాల కోసం తగిన ఏర్పాట్లు చేశారు.

ఉగాది శుభాకాంక్షలు తెలిపిన కలెక్టర్

శుభాలను ఇచ్చే సంవత్సరం శ్రీ క్రోధి నామ సంవత్సరమని, ప్రజలందరూ శుభాలతో ఉగాది పర్వదినాన్ని ఆనందోత్సవాలతో జరుపుకోవాలని కలెక్టర్ పి.ప్రావీణ్య ఓ ప్రకటనలో ఆకాంక్షించారు. శ్రీ క్రోధి నామ సంవత్సరం ప్రారంభం కానున్న సందర్భంగా సమృద్ధిగా వానలు కురిసి, రైతుల కుటుంబాల్లో సుఖసంతోషాలు వెల్లివిరియాలని అభిలషించారు.

పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించాలి: కలెక్టర్


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రావీణ్య

వరంగల్ కలెక్టరేట్, ఏప్రిల్ 8: అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీల ద్వారా ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించేందుకు తగిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ప్రావీణ్య అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో డీఈవో వాసంతి, డీఆర్‌డీవో కౌసల్యాదేవితో కలిసి ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనపై సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ పాఠశాలల అభివృద్ధికి సంబంధించి అమ్మ ఆదర్శ కమిటీ ఆధ్వర్యంలో ప్రణాళికలు సిద్ధం చేసి త్వరితగతిన పనులు చేపట్టాలన్నారు. వేసవి సెలవులు ముగిసి వచ్చే విద్యా సంవత్సరం ప్రారంభంలోగా సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పన పూర్తి కావాలని సూచించారు. కమిటీల ఆధ్వర్యంలో రూ.25వేల చొప్పున చిన్న చిన్న మరమ్మతు పనులను మే నెల 10వ తేదీలోగా పూర్తి చేయాలన్నారు. 15 రోజుల్లో ఎన్నికల పోలింగ్ ఉన్న పాఠశాలల్లో విద్యుత్, తాగునీరు, మరుగుదొడ్ల పనులన్ని పూర్తి కావాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో లీడ్ బ్యాంక్ మేనేజర్ హవేలి రాజు, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు, డీఈలు, ఏఈలు, ఎంఈవోలు తదితరులు పాల్గొన్నారు.


పగుళ్లు తేలిన 20వ పిల్లరును పరిశీలిస్తున్న సీపీఎం నాయకులు

రాజకీయాలు పక్కకు పెట్టండి..
రైతులకు నీళ్లివ్వండి

- ▸▸ మేడిగడ్డ బ్యారేజీ నిర్మాణ అక్రమాలపై న్యాయవిచారణ చేపట్టాలి
- ▸▸ ఆరోపణలు ప్రతి ఆరోపణలతో కాలయాపన చేయకండి
- ▸▸ సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు వీరయ్య

8

7లో..
ఘోషిస్తున్న వేద పాఠశాల

ఘోషిస్తున్న వేద పాఠశాల

నీడ కోసం దీన చూపులు

- మాడవీధుల నిర్మాణంతో కోల్పోతున్న భవనం
- ధార్మిక భవన్‌లోకి తరలించే ప్రతిపాదన
- ససేమిరా అంటున్న దేవాదాయశాఖ అధికారులు
- మూతపడే దిశగా పాఠశాల
- రోడ్డునపడనున్న విద్యార్థులు

హనుమకొండ, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి) : భద్రకాళి గుడి ప్రాంగణంలో ఎన్నో ఏళ్లుగా నిర్వహిస్తున్న వేద పాఠశాల ప్రత్యామ్నాయ నీడ కోసం పరితపిస్తోంది. ధార్మిక భవన్‌లో కాసింత చోటిస్తే అందులో సర్దుకొనేందుకు సిద్ధపడుతోంది. కానీ దేవాదాయ శాఖ అధికారులే వసతి ఇచ్చేందుకు ససేమిరా అంటున్నారు. దీనితో వేద పాఠశాల ఉనికి ప్రశ్నార్థకంగా మారనున్నది. అందులో వేదం అభ్యసిస్తున్న విద్యార్థులు రోడ్డున పడే పరిస్థితి ఏర్పడనుంది.

ఎన్నో ఏళ్లుగా...

వరంగల్‌లో సుప్రసిద్ధమైన భద్రకాళి దేవాలయ ప్రాంగణంలో వేద పాఠశాల ఎన్నో ఏళ్లుగా నడుస్తోంది. తెలంగాణ రాష్ట్రంలో ఆలయాల ఆధ్వర్యంలో నడుస్తున్న అయిదు వేద పాఠశాలల్లో ఇది ఒకటి. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తొలి వేద పాఠశాల ఇది. వేలాది మంది విద్యార్థులను వేదపండితులుగా తీర్చిదిద్దిన ఘన చరిత్ర ఈ పాఠశాలకు ఉంది. ఇక్కడ వేదం నేర్చుకొని వేదపండితులుగా, అర్చకులుగా అనేక మంది పలు దేవాలయాల్లో స్థిరపడ్డారు.. ఇప్పుడు ఈ పాఠశాల ఉనికికే ప్రమాదం ఏర్పడింది.

కూల్చివేతకు గురికానున్న భవనం

భద్రకాళి దేవాలయం చుట్టూర రూ.30 కోట్ల వ్యయంతో మాడవీధుల నిర్మాణాన్ని చేపట్టింది తెలిసిందే. ఇటీవల పనులు ప్రారంభమయ్యాయి. మాడవీధుల్లో కొంత భాగంగా భద్రకాళి చెరువు మీది నుంచి నిర్మాణం కాగా, మిగతా సగ భాగం ఆలయం వెనుక నుంచి నిర్మాణం కానుంది.. ఈ క్రమంలో అడ్డుగా ఉన్న వేదపాఠశాల భవనాన్ని తొలగించాల్సిన అనివార్యత ఏర్పడింది. దీంతో పాఠశాలను మరోచోటికి తరలించాల్సిన పరిస్థితి ఏర్పడింది. ప్రత్యామ్నాయంగా పాఠశాలను ఇటీవల పాతసెంట్రల్ జైలుకు ఎదురుగా నిర్మించిను ధార్మిక భవనంలోకి తరలించాలనే ప్రతిపాదన చేశారు. ఇదే విషయాన్ని రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, కలెక్టర్ సిక్తాపట్నాయక్ దృష్టికి తీసుకువచ్చారు. ఇందుకు ఈ ఇద్దరు సుముఖత వ్యక్తం చేశారు. కానీ దేవాదాయ శాఖ అధికారులే ససేమిరా అంటున్నట్లు తెలుస్తోంది. పాఠశాల నిర్వహణకు అవసరమైన చోటు భవన్‌లో లేదని, పైగా ఇక్కడ పాఠశాలను నిర్వహిస్తే ఇందులోని కార్యాలయాల్లో పని చేసే సిబ్బంది విధులకు ఆటంకంగా ఉంటుందన్న సాకులను చూపుతున్నట్లు సమాచారం.

ధార్మిక భవనంలో దొరకని చోటు:

ధార్మిక భవనాన్ని ఇటీవలే రూ.3 కోట్ల వ్యయంతో మూడంతస్తులతో నిర్మించారు. ఇందులో దేవాదాయ శాఖ డిప్యూటీ కమిషనర్, అసిస్టెంట్ కమిషనర్ కార్యాలయాలు నిర్వహిస్తున్నారు. వీటితో పాటు ములుగు జిల్లా తాడ్వాయి మండలం మేడారంలో ఉండాల్సిన సమ్మక్క సారలమ్మ జాతర ఈవో కార్యాలయం కూడా ఇందులోనే ఉంది. ఈ మూడు ఆఫీసులకు ఇంత పెద్ద విశాలమైన భవనం అవసరమే లేదన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఈ ఆఫీసులకు పోను వేద పాఠశాల నడవడానికి అవసరమైన చాలా స్థలం ఈ భవనంలో ఉంది. అయినా కూడా దేవాదాయ శాఖకు అనుబంధంగా నడుస్తున్న వేద పాఠశాలను తమ దరదాపుల్లోకి రాకుండా అధికారులు అడ్డుపడుతుండడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈ ధార్మిక భవనం నిర్మాణంలో భద్రకాళి గుడి నుంచి రూ. కోటి వాడుకున్నారు. మడికొండలోని మెట్టుగుట్ట ఆలయం నుంచి రూ. కోటి, సమ్మక్క సారలమ్మ జాతర దేవస్థానం నుంచి రూ.కోటి వాడుకున్నారు. భద్రకాళి గుడి నిధులు మాత్రం తీసుకుంటారు గానీ ఆ ఆలయం ఆధ్వర్యంలో నిర్వహించే వేదపాఠశాలకు మాత్రం ధార్మిక భవన్‌లో కాసింత చోటివ్వడానికి నిరాకరిస్తున్న దేవాదాయ శాఖ అధికారుల తీరుపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మంత్రి, కలెక్టర్ ఆదేశాలను సైతం అధికారులు బేఖాతరు చేస్తున్నారు.



మాడవీధుల నిర్మాణంతో తొలగించనున్న భద్రకాళి ప్రాంగణంలో ప్రస్తుతం ఉన్న వేద పాఠశాల భవనం

మంత్రితో పాటు విజిలెన్స్ ఆరా..

ధార్మిక భవనంలో మరో అంతస్తు నిర్మాణానికి మెట్టురామలింగేశ్వర దేవాలయం ఆదాయం నుంచి దేవాదాయశాఖ అధికారులు రూ.50 లక్షలు తీసుకోవడంపై రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖతో పాటు ఇంటలిజెన్స్ అధికారులు ఆరా తీసినట్టు తెలుస్తోంది. 'దేవుడి సొమ్ముకు ఎసరు' శీర్షికతో సోమవారం ఆంధ్రజ్యోతిలో వచ్చిన వార్త కథనానికి స్పందించిన మంత్రి ఆరా తీసినట్టు సమాచారం. ఇంటలిజెన్స్ అధికారులు సైతం స్పందించారు. ధార్మిక భవనంలో ఫర్నీచర్ కోసం మరో రూ.30 లక్షలను మూడు దేవాలయాల నుంచి తీసుకోవడంపై కూడా వివరాలను సేకరిస్తున్నట్టు సమాచారం. అంతే కాకుండా అంతకు ముందు భద్రకాళి గుడి ప్రాంగణంలోని భవనంలో గతంలో దేవాదాయశాఖ కార్యాలయాల సముదాయంలోని సుమారు రూ.10 లక్షల విలువైన ఫర్నీచర్ ఏమైందనే విషయమై కూడా ఆరా తీస్తున్నట్టు తెలుస్తోంది.

రోడ్డునపడనున్న విద్యార్థులు

ధార్మిక భవనంలో వేదపాఠశాలకు చోటు దొరకని పక్షంలో వేద పాఠశాల నెలవు కోల్పోయి ప్రత్యామ్నాయ మార్గం లేక చివరకు మూతపడే పరిస్థితి ఏర్పడున్నది. దీంతో ఇందులో చదువుకుంటున్న విద్యార్థులు వీధినపడనున్నారు. వాస్తవానికి ఈ వేద పాఠశాలను ఆలయ ప్రాంగణం నుంచి మరో చోటికి తరలించాలనే ప్రతిపాదన ఎప్పటి నుంచో ఉంది. ప్రస్తుత భవనం ఆలయం కట్టకింద లోతట్టున ఉండడంతో భారీ వర్షాలు వచ్చిన ప్రతీసారి ఇందులోకి వరద నీరు ప్రవేశిస్తోంది. విద్యార్థుల పుస్తకాలు, వస్తువులు తడిసిపోతున్నాయి. వరదనీటి ప్రవాహంతో పాములు భవనంలోకి కొట్టుకువస్తున్నాయి. దీనితో భారీ వర్షాలు పడిన ప్రతీ సారి విద్యార్థులు బిక్కుబిక్కుమంటూ కాలం గడుపుతున్నారు. గత సంవత్సరం జూన్‌లో కురిసిన భారీ వర్షాలకు విద్యార్థులు వరదనీటిలో చిక్కుకుపోయారు. అతికష్టం మీద వారిని బయటకు రప్పించారు. కొద్ది రోజులు పాఠశాల మూతపడింది. కొత్త అడ్మిషన్లలో జాప్యం ఏర్పడింది. ఇటువంటి పరిస్థితుల్లో గోరుచుట్టుపై రోకలి పోటులా మాడవీధుల నిర్మాణం వల్ల ఉన్న భవనం కూడా కోల్పోతుండడంతో వేద పాఠశాల ఉనికే ప్రశ్నార్థకంగా మారింది. దాని నిర్వహణపై నీలినీడలు పరుచుకుంటున్నాయి. ఈ క్రమంలో మాడవీధుల నిర్మాణం తర్వాత అనువైన స్థలంలో స్వంత భవనం నిర్మాణం అయ్యే వరకు తాత్కాలికంగా పాఠశాలను ధార్మిక భవన్‌కు తరలించడం ఒక్కటే మార్గంగా కనిపిస్తున్నది. పాఠశాల నిర్వాహకులు అక్కడి మార్చేందుకు అన్ని ఏర్పాట్లు చేసుకోగా దేవాదాయ శాఖ అధికారులు మోకాలు అడ్డుతుండడంతో తరలింపుపై అనిశ్చిత పరిస్థితి నెలకొన్నది. మంత్రి కొండ సురేఖ, కలెక్టర్ సిక్తాపట్నాయక్ ఈ విషయంలో చొరవ తీసుకొని ధార్మిక భవన్‌లోకి వేద పాఠశాల తరలేలా చూడాలని కాకతీయ వారసత్వ పరిరక్షణ కమిటీ కన్వీనర్ చీకటి రాజుతో పాటు పలువురు ధార్మికవేత్తలు, వేదపండితులు కోరుతున్నారు.



కార్యకర్తల కష్టసుఖాలలో పాలుపంచుకుంటా..

మాట్లాడుతున్న అరూరి రమేశ్

- బీజేపీ వరంగల్ పార్లమెంట్ అభ్యర్థి అరూరి రమేశ్

ధర్మసాగర్, ఏప్రిల్ 8: కార్యకర్తల కష్టసుఖాలలో పాలుపంచుకుంటూ కంటికి రెప్పలా కాపాడుకుంటామని వరంగల్ పార్లమెంట్ బీజేపీ పార్టీ అభ్యర్థి అరూరి రమేశ్ అన్నారు. సోమారం ధర్మసాగర్ మండల కేంద్రంలో బీజేపీ మండల అధ్యక్షుడు చట్ల రాజు ఆధ్వర్యంలో నిర్వహించిన ధర్మసాగర్, వేలేరు మండలాల విస్తృత స్థాయి సమావేశానికి ఎంపీ అభ్యర్థి ఆరూరి రమేశ్, మాజీ మంత్రి విజయరామారావు, మాజీ మేయర్ రాజేశ్వర్‌రావు, మాజీ ఎమ్మెల్యే ధర్మారావు హాజరయ్యారు. ఈ సందర్భంగా అరూరి రమేశ్ మాట్లాడుతూ పార్టీలో కార్యకర్తల అందరినీ కలుపుకొని పార్టీ కోసం పని చేస్తామన్నారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమాన్ని చూసి మోదీ నాయకత్వంలోని బీజేపీలో చేరానన్నారు. మాజీ మంత్రి విజయ రామారావు మాట్లాడుతూ దేశ భవిష్యత్ యువత చేతుల్లో ఉందని, ప్రధాన మంత్రి చేస్తున్న అభివృద్ధిని ఇంటింటికీ వెళ్లి అవగాహన కల్పించాలన్నారు. మాజీ మేయర్ రాజేశ్వర్‌రావు మాట్లాడుతూబీజేపీ 400సీట్లు గెలిచే అవకాశం ఉందన్నారు. కడియం శ్రీహరి బిడ్డ కోసం నీతిమాలిన రాజకీయాలు చేస్తున్నారని విమర్శించారు. మాజీ ఎమ్మెల్యే ధర్మారావు మాట్లాడుతూ పేదవాడికి న్యాయం చేసే పార్టీ బీజేపీ అని అన్నారు. ఎంపీ అభ్యర్థి రమేశ్‌ను లక్ష ఓట్ల మెజారిటీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. ఆనంతరం తాటికాయల గ్రామానికి చెందిన యువకులు అరూరి సమక్షంలో బీజేపీలో చేరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు విజయరావు, జిల్లా నాయకులు శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వడదెబ్బతో వృద్ధురాలి మృతి



బొమ్మగాని నిర్మల (ఫైల్)

జనగామ, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): వడదెబ్బతో వృద్ధురాలు మృతిచెందిన సంఘటన జనగామ జిల్లాకేంద్రంలో సోమవారం జరిగింది. కుటుంబ సభ్యులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం జిల్లాకేంద్రంలోని సంజయ్‌నగర్‌కు చెందిన బొమ్మగాని నిర్మల (65) స్థానికంగా ఓ హోటల్‌లో పనిచేస్తోంది. ఇంటి నుంచి హోటల్‌కు రోజు నడుచుకుంటూ వెళ్లి వచ్చేది. ఈ క్రమంలో రెండు క్రితం హోటల్ నుంచి ఇంటికి ఎండలో నడుకుంటూ రాగా అస్వస్థతకు గురైంది. దీంతో కుటుంబ సభ్యులు చికిత్స చేయించారు. ఈ క్రమంలో ఆదివారం అర్ధరాత్రి పరిస్థితి విషమించడంతో స్థానిక ఏరియా ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ సోమవారం ఉదయం మృతిచెందింది. మృతురాలి కుమారుడు శ్రీకాంత్‌గౌడ్ ఓ దిన పత్రికలో రిపోర్టరుగా పనిచేస్తున్నాడు. మృతురాలికి ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

పలువురి పరామర్శ

వడదెబ్బతో మృతిచెందిన నిర్మల కుమారుడు శ్రీకాంత్‌గౌడ్‌ను కాంగ్రెస్, బీఆర్ఎస్, సీపీఎంతో పాటు పలు పార్టీల నాయకులు, జర్నలిస్టులు పరామర్శించారు. జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి మృతదేహంపై పూలమాల వేసి నివాళులు అర్పించారు. అదేవిధంగా కాంగ్రెస్ నేతలు చెంచారపు శ్రీనివాస్‌రెడ్డి, మేడ శ్రీనివాస్, చెంచారపు బుచ్చిరెడ్డి, కౌన్సిలర్లు రాంచందర్, జక్కుల అనిత, సీపీఎం భువనగిరి అభ్యర్థి ఎండి.జహంగీర్, సీపీఎం నేతలు బూడిద గోపి, జోగు ప్రకాశ్ తదితరులు పరామర్శించారు. శ్రీకాంత్‌గౌడ్‌కు మాజీ మంత్రి పొన్నాల లక్ష్మయ్య ఫోన్ ద్వారా సంతాపం తెలిపారు. శ్రీకాంత్‌గౌడ్ ఆర్థిక పరిస్థితి బాగాలేకపోవడంతో జనగామ జర్నలిస్టులు, పలువురు నేతలు ఆర్థికసాయం అందించారు.

పెళ్లింట విషాదం.. విద్యుదాఘాతంతో రైతు మృతి



చందర్ (ఫైల్)

ఖానాపురం, ఏప్రిల్ 8 : పెళ్లింట విషాదం నెలకొంది.. ఈనెల 24న కుమారుడి వివాహం కోసం ఏర్పాట్లు చేస్తుండగా.. విద్యుదాఘాతంతో సోమవారం రైతు మృత్యువాత పడడంతో ఖానాపురం మండలం కొడ్తిమాట్‌తండాలో విషాదం నెలకొంది. పోలీసుల కథనం ప్రకారం..

కొడ్తిమాట్‌తండాలకు చెందిన బానోతు చందర్(52)కు భార్య ఇద్దరు కుమారులున్నారు. కాగా, తనకున్న రెండున్నర ఎకరాల్లో మొక్కజొన్న, అపరాల సాగు చేస్తున్నాడు. పంటకు తన వ్యవసాయ బావి నీరు సరిపోకపోవడంతో సమీపంలో ఉన్న తన చిన్నాన్న(సమీప బంధువు) బావి నుంచి కొన్ని రోజులుగా నీటిని వాడుకుంటున్నాడు. రోజులాగే మోటార్ స్టాటర్‌ను ఆన్ చేస్తుండగా ప్రమాదవశాత్తు షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందాడు. కాసేపటికి సమీపంలోని రైతులు గమనించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. పోలీసులు శవపంచనామా నిర్వహించి పోస్ట్‌మార్టం నిమిత్తం తరలించారు. మృతుడి భార్య హచ్చమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. హెడ్ కానిస్టేబుల్ రమేష్ తెలిపారు. చందర్ చిన్నకుమారుడు శివకు ఈనెల 24 వివాహం చేయడానికి ఏర్పాట్లు చేస్తున్నారు. బట్టలు, బంగారం కొనుగోలు చేశారు. పెండ్లి పనుల్లో ఉండగానే చందర్ మృతి చెందడంతో పెళ్లింట్లో విషాదం నెలకొంది.

బైక్ అదుపు తప్పి ఒకరి మృతి



శివ (ఫైల్)

చిట్యాల, ఏప్రిల్ 8: ద్విచక్ర వాహనం అదుపుతప్పి ఒకరు మృతిచెందిన సంఘటన చిట్యాల మండలం ముచినిపర్తి శివారు వెంకటేశ్వర్లపల్లిలో సోమవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రేగొండ మండలం కొడవటంచ గ్రామానికి చెందిన నాగుల శివ (26) వ్యక్తిగత పని నిమిత్తం గణపురం మండలం కర్కపల్లికి ద్విచక్రవాహనంపై వెళ్తున్నాడు. ఈక్రమంలో వెంకటేశ్వర్లపల్లి గ్రామ శివారులో ద్విచక్రవాహనం అదుపు తప్పి కిందపడిపోయాడు. తలకు తీవ్ర గాయం కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. సంఘన స్థలాన్ని ఎస్సై-2 షాఖాన్ సందర్శించి వివరాలు సేకరించారు. మృతుడికి భార్య లావణ్య, మూడు సంవత్సరాల కుమారుడు ఉన్నాడు.

పురుగుల మందు తాగి వివాహిత ఆత్మహత్య



మృతురాలు నాగమణి

నర్మెట, ఏప్రిల్ 8 : పురుగుల మందు తాగి ఓ వివాహిత ఆత్మహత్య చేసుకున్న సంఘటన సోమవారం మండలంలోని లోక్యతండా గ్రామ పంచాయతీ పరిధిలోని హన్మచంద్రుతండాలో చోటు చేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం హన్మచంద్రుతండాకు చెందిన బానోతు వేణు నాగమణి(21) భార్యభర్తలకు గత కొద్ది రోజులుగా గొడవ జరుగుతోంది. ఈ క్రమంలో సోమవారం గొడవ జరిగింది. దీంతో మనస్తాపం చెందిన నాగమణి ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడింది. ఎక్కువ మోతాదులో తాగడంతో ఇంట్లోనే మృతి చెందింది. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని జనగామ ఏరియా ఆసుపత్రికి తరలించారు. నాగమణి మృతిపై బంధువులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. నాగమణి మృతికి భర్త వేణు వేధింపులే కారణమని, కొట్టి చంపి ఉంటాడని మృతురాలు బంధువులు ఆరోపిస్తున్నారు. మృతురాలికి మూడు నెలల చిన్న బాబు ఉన్నాడు. భర్త వేణుపై చర్యలు తీసుకోవాలని జనగామ ఏరియా ఆస్పత్రి ఎదుట మృతురాలు బంధువులు గొడవ చేసినట్లు సమాచారం. ఈ విషయమై ఎస్సై కన్నెబోయిన శ్రీకాంత్‌ను వివరణ అడుగగా తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని తెలిపారు.

ఐస్‌క్రీంలో ఎలాంటి వ్యర్థ పదార్థాలు కలుపలేదు

- జిల్లా సహాయ ఆహార నియంత్రణాధికారి

నెక్కొండ, ఏప్రిల్ 8 : నెక్కొండలోని అంబేద్కర్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన ఐస్‌క్రీం బండిలో వ్యర్థ పదార్థాలు (మూత్రం, వీర్యం) కలిపి అమ్ముతున్నట్లు సోషల్ మీడియాలో జరిగిన ప్రచారం అవాస్తవమని జిల్లా సహాయ ఆహార నియంత్రణాధికారి పి.అమృతశ్రీ సోమవారం రాత్రి తెలిపారు. ఐస్‌క్రీంలో వ్యర్థ పదార్థాలను కలిపి అమ్ముతున్న విషయమై జిల్లా ఫుడ్ ఇన్‌స్పెక్టర్ ఆదేశాల మేరకు మార్చి 19న బండి యజమాని కాలురాంపై పోలీసు కేసు నమోదు చేయడంతో పాటు అతను విక్రయించిన ఐస్‌క్రీం సంబంధించి నాలుగు నమూనాలను సేకరించి రాష్ట్ర ఆహార ప్రయోగశాల హైదరాబాద్‌కు పరీక్షల నిమిత్తం పంపించామన్నారు. కానీ ఐస్‌క్రీం పదార్థాలో (మనిషికి సంబంధించి మూత్రం, వీర్యం) ఎలాంటి వ్యర్థాలు కలువలేదని ల్యాబ్ అధికారులు తెల్పినట్లు చెప్పారు. సామాజిక మాధ్యమంలో వచ్చే వీడియోలను సరైన పద్ధతిలో నిర్ధారించుకొని, ఆహార అధిదీకృత అధికారుల తనిఖీల తర్వాత ప్రజలు నమ్మాలన్నారు.

హేమాచలుడిని దర్శించుకున్న సీసీఎఫ్

మంగపేట, ఏప్రిల్, 8: మండలంలోని మల్లూరు హేమాచల లక్ష్మీనరసింహస్వామి ఆలయాన్ని కాళేశ్వరం చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ (సీసీఎఫ్) ప్రభాకర్ సోమవారం దర్శించుకున్నారు. ఆయనకు అర్చకులు రాజశేఖరశర్మ, రాఘవాచార్యులు, ఈశ్వర్‌చంద్ శర్మ స్వాగతం పలికారు. గోత్రనామాలతో అర్చనలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. స్వామివారి శేషవస్త్రాలతో సత్కరించారు.సీసీఎఫ్ వెంట తాడ్వాయి ఎఫ్ఆర్వో సత్తయ్య, మంగపేట డిప్యూటీ రెంజర్ కోటేశ్వర్, ఇతర ఫారెస్ట్ ఉద్యోగులు ఉన్నారు.



సీసీఎఫ్‌కు స్వాగతం పలుకుతున్న అర్చకులు

నేటినుంచి భద్రకాళి ఆలయంలో నవరాత్రి మహోత్సవాలు

వరంగల్ కల్చరల్, ఏప్రిల్ 8 : వరంగల్ నగరంలోని భద్రకాళి అమ్మవారి దేవస్థానంలో వసంత నవరాత్రి మహోత్సవాలు నేటి నుంచి 17వ తేది వరకు వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ కార్యనిర్వాహణాధికారి శేషభారతి ఒక ప్రకటనలో తెలిపారు. శ్రీక్రోధి నామ సంవత్సరం ఉగాది రోజున మంగళవారం అమ్మవారికి పూర్ణాభిషేకం నిర్వహించడంతో నవరాత్రి రథం ప్రారంభమవుతుందన్నారు. చైత్ర శుద్ధ పాడ్యమి రోజున బ్రహ్మ తన సృష్టిని పూర్తి చేశాడని శ్రీభద్రకాళి అమ్మవారే బ్రహ్మ స్వరూపమని వసంత నవరాత్రి ఉత్సవాల్లో అమ్మవారిని పూజిస్తే అన్ని శుభాలు కలుగుతాయని తెలిపారు.

ఎంజీఎంలో రేడియాలజీ విభాగంలో ఆగిన సేవలు

వరంగల్ మెడికల్, ఏప్రిల్ 8 : వరంగల్ ఎంజీఎం హాస్పిటల్‌లో సోమవారం డిజిటల్ ఎక్స్‌రే మిషన్ పని చేయక రోగులు ఇబ్బంది పడ్డారు. ఆస్పత్రి రేడియాలజీ డిపార్ట్‌మెంట్‌లో ఉన్న ఎక్స్‌రే మిషన్‌లో డిజిటల్ ఎక్స్‌రే మిషన్ ఒకటి మాత్రమే గత కొన్ని సంవత్సరాలుగా పని చేస్తోంది. మరో రెండు మిషన్లు ఉన్నా అవి మొబైల్ ఎక్సరే కావడంతో సేవలు అంతంత మాత్రంగానే పని చేస్తున్నాయి. సోవవారం ఓపీ, ఐపీ రోగులు అధికంగా రావడంతో ఎక్స్‌రే మిషన్లు పని చేయక ఇబ్బంది పడ్డారు. చివరకు మొబైల్ ఏక్సేంజ్ మిషన్‌పై ఎమర్జెన్సీ రోగులకు ఎక్స్‌రేలు తీశారు. పనిచేయని డిజిటల్ ఎక్సరే మిషన్‌ను రిపేర్ చేయిస్తామని అధికారులు తెలిపారు.

రేషన్ బియ్యం పట్టివేత

వరంగల్ క్రైం, ఏప్రిల్ 8: హసన్‌పర్తి పోలీస్ స్టేషన్ పరిధిలోని పరిసరాల్లో రూ.13 లక్షల విలువైన పీడీఎస్ బియ్యాన్ని రాష్ట్ర ఎన్‌ఫోర్స్‌మెంట్, టాస్క్‌ఫోర్స్ పోలీసులు పట్టుకున్నారు. స్టేషన్ పరిధిలో పెద్దఎత్తున పీడీఎస్ రైస్ దందా నడుస్తుందనే సమాచారంతో ఎన్‌ఫోర్స్‌మెంట్, టాస్క్‌ఫోర్స్ పోలీసులు సోమవారం నిఘా వేసి బియ్యం తరలిస్తున్న లారీని స్వాధీనం చేసుకున్నారు. వరంగల్ నగరానికి చెందిన జన్ను అనిల్ అనే వ్యక్తి వర్ధన్నపేట నియోజకవర్గ పరిధిలోని గ్రామాల్లో పీడీఎస్ రైస్ సేకరించి లారీలో మహారాష్ట్రకు తరలించేందుకు యత్నిస్తున్న క్రమంలో పట్టుకున్నారు. 680 బ్యాగులతో కూడిన లారీని స్టేషన్‌కు తరలించి డ్రైవర్ సునిల్‌ను, అక్రమ దందా చేస్తున్న అనిల్‌ను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశారు. ఈ విషయన్ని హసన్‌పర్తి పోలీసులు ధృవీకరించారు.

అత్యాశకు పోయి డబ్బులు పోగొట్టుకున్న వ్యక్తి

హనుమకొండ టౌన్, ఏప్రిల్ 8 : వాట్సాప్ లింకు ఓపెన్ ద్వారా వచ్చే డబ్బులకు ఆశపడి ఓ వ్యక్తి డబ్బులు పోగొట్టుకున్నాడు. వివరాల్లోకి వెళితే.. రాయపురకు చెందిన మహ్మద్ ఇబ్రహీం ఓ వాట్సాప్ గ్రూప్‌లో వచ్చిన లింక్‌ను ఓపెన్ చేయగా టెలిగ్రామ్ ఐడికి కనెక్ట్ అయ్యాడు. అటు నుంచి గుర్తుతెలియని వ్యక్తి కంపెనీ మేనేజర్‌గా చాట్ చేసి ట్రేడింగ్ ద్వారా డబ్బులను డబుల్ చేసుకోవచ్చని ఆశ కల్పించాడు. వారిచ్చిన ఐడికి మూడు దశలో 7,000 ట్రాన్స్‌ఫర్ చేయగా తిరిగి 8,327 రూపాయలు ఇబ్రహీంకు ట్రాన్స్‌ఫర్ చేశారు. తర్వాత ఇన్వెస్ట్ చేయమని చాట్ చేయగా 5,000 ట్రాన్స్‌ఫర్ చేశాడు. ఇంకొక 30,000 చేస్తే విత్ డ్రా ఆప్షన్ వస్తుందని చెప్పగా 30,000 ట్రాన్స్‌ఫర్ చేశాడు. అయినా విత్ డ్రా ఆప్షన్ రాకుండా మరోక సారి డబ్బులు ఇన్వెస్ట్ చేయాలని అడగడంతో మోసపోయినని గ్రహించిన బాధితుడు హనుమకొండ పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పున్నేలులో మద్యం పట్టివేత

ఐనవోలు, ఏప్రిల్ 8 : అనుమతులు లేకుండా విక్రయిస్తున్న మద్యాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఎస్సై అనిల్ కుమార్ కథనం ప్రకారం పున్నేలు గ్రామంలో రావుల రాజు అనే వ్యక్తి తన ఇంట్లో మద్యం నిల్వచేసి విక్రయిస్తుండగా తనిఖీలు నిర్వహించి రూ.7821 వేల మద్యాన్ని స్వాధీనం చేసుకొని ఆయనపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

అందరికీ విద్య ప్రభుత్వ బాధ్యత

- ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలు ఉన్నత విద్యకు దూరం
- వర్సిటీలకు యూజీసీ నిధులు తగ్గాయి..
- ప్రముఖ సామాజిక వేత్త, ప్రొఫెసర్ హరగోపాల్
- కేయూలో ఉన్నత విద్యపై సింపోజియం

కేయూ క్యాంపస్, ఏప్రిల్ 8 : అందరికీ విద్య ప్రభుత్వ బాధ్యతని ప్రముఖ సామాజిక వేత్త, హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయం రిటైర్డు ప్రొఫెసర్ జి.హరగోపాల్ అన్నారు. సోమవారం కేయూ సెనెట్ హాల్‌లో కేయూ రిటైర్డు ప్రొఫెసర్ల సంఘం అధ్యక్షుడు ప్రొఫెసర్ ఎ.సదానంద అధ్యక్షతన సింపోజియం నిర్వహించారు. 'తెలంగాణలో ఉన్నత విద్య ప్రస్తుత పరిస్థితులు-బలోపేతం చేయడానికి అనుసరించాల్సిన విధానాలు' అనే అంశంపై హరగోపాల్ మాట్లాడారు. ప్రభుత్వాలు మారినప్పటికీ విద్యకు బడ్జెట్‌లో నిధులు పెంచడం లేదన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాలు ఉన్నత విద్యకు దూరం అవుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. యూజీసీ నిధులు బాగా తగ్గించారని చెప్పారు. పరిశోధన ప్రాజెక్టులు నిధుల లేమితో ఇబ్బందులు పడుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. విద్య ప్రైవేట్, వాణిజ్యపరం కావడంతో తరువాతి తరం వారు సేవ దృక్పథాన్ని మరిచి వాణిజ్య పరంగా వ్యవహరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

ప్రపంచ బ్యాంకు నిబంధనల మేరకు విద్య ప్రైవేట్ పరం అవుతోందని హైదరాబాద్ ఉస్మానియా యూనివర్సిటీ ప్రొఫెసర్ కోదండరాం అన్నారు. గత కొన్నేళ్ళుగా విద్య రంగంపై ప్రభుత్వాలు నియమించిన కమిటీలు వాటి సిఫార్సులను వివరించారు. ప్రపంచంలో నిరంతరం ఎదురవుతున్న పోటీలకు దీటుగా ప్రభుత్వ విద్య సంస్థలుండాలని అన్నారు.

రాష్ట్రంలో విద్య రంగంలో గ్రాస్ ఎన్‌రోల్‌మెంట్ రేషియోలో ప్రగతి ఉందని రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ ఆర్.లింబాద్రి అన్నారు. రాష్ట్రంలోని 99 డిగ్రీ కళాశాలలు న్యాక్ గ్రేడింగ్ పొందాయని చెప్పారు. దేశంలో బెస్ట్ ప్రాక్టీస్‌గా దోస్త్ అడ్మిషన్ల ప్రక్రియ నిలుస్తోందని చెప్పారు. అన్ని కళాశాలల్లో రూల్స్ ఆఫ్ రిజర్వేషన్లు ఖచ్చితంగా అమలవుతున్నాయని చెప్పారు. విద్య లక్ష్యం విద్యార్థి వికాసం, ఉపాధి, ఆత్మ విశ్వాసం కావాలని కోరారు. కాకతీయ యూనివర్సిటీ వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ తాటికొండ రమేశ్ మాట్లాడుతూ.. స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి విద్య రంగ పురోగతికి ప్రభుత్వాలు చాలా కమిటీలను ఏర్పాటు చేసినప్పటికీ స్పష్టత రాలేదని వివరించారు. 75 ఏళ్ళ భారతంలో గుణాత్మక విద్య అందించలేకపోతున్నామని అవేదన వ్యక్తం చేశారు. బడ్జెట్‌లో నిధుల కేటాయింపు తక్కువగా ఉందన్నారు. వర్సిటీలు క్రాస్ రోడ్డులో ఉన్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. యూజీసీ రిటైర్డు చైర్మన్ సుఖదేవ్ థోరట్ జూమ్ వెబ్‌సైట్‌లో సమావేశంలో మాట్లాడారు. యూజీసీ బడ్జెట్ కోత ఉందని చెప్పారు. ప్రభుత్వం పరిశోధనలకు, ప్రాజెక్టులకు నిధులు ఇవ్వడం లేదన్నారు. తెలంగాణ అకాడమి ఆఫ్ సైన్స్ అధ్యక్షుడు డాక్టర్ సీహెచ్. మోహన్‌రావు మాట్లాడుతూ.. విశ్వవిద్యాలయాలు స్టూడెంట్స్ కేంద్రంగా ఉండాలని అన్నారు. జీడీపీలో విద్య రంగానికి పెద్ద మొత్తంలో నిధులు కేటాయించాలని అన్నారు. సమావేశంలో విశ్రాంత ప్రొఫెసర్ల సంఘం జనరల్ సెక్రటరీ ప్రొఫెసర్ వడ్డె రవీందర్, ఎస్డీఎల్‌సీఈ మాజీ డైరెక్టర్ ప్రొఫెసర్ జి.వీరన్ననాయక్, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.మల్లారెడ్డి, హైయర్ ఎడ్యుకేషన్ మాజీ చైర్మన్ ప్రొఫెసర్ టి.పాపిరెడ్డి, ప్రొఫెసర్ కూరపాటి వెంకట్‌నారాయణ, ప్రొఫెసర్ ఇక్బాల్ అలీ, ప్రొఫెసర్ తాటం శ్రీనివాస్, ప్రొఫెసర్ గాదె దయాకర్, ప్రొఫెసర్ ఎర్రగట్టు స్వామి, చింత సమ్మయ్య, క్యాంపస్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ బి.సురేశ్‌లాల్, కృష్ణమాచారి, సంజీవరెడ్డి, సాయులు, దీపాజ్యోతి, రామస్వామి, ఇంద్రాసేనారెడ్డి, రామిరెడ్డి, కట్ల రాజేందర్, ప్రొఫెసర్ కె.కాత్యాయని విద్మహే, రాంనాథ్‌కిషన్, సక్రియా, ప్రొఫెసర్ శోభ, ఎఆర్ పెండ్లి అశోక్‌బాబు పాల్గొన్నారు.

16న 'స్వీప్' ఆధ్వర్యంలో 5కే రన్



మాట్లాడుతున్న ట్రెయినీ కలెక్టర్ శ్రద్ధా శుక్లా

హనుమకొండ కలెక్టరేట్, ఏప్రిల్ 8 : ఓటు హక్కు కలిగిన ఓటర్లు ఎన్నికల్లో ఓటు వేసే విధంగా చైతన్యవంతం చేసేలా స్వీప్ ఆధ్వర్యంలో ఈ నెల 16వ తేదీన 5కే రన్ నిర్వహించనున్నట్లు ట్రెయినీ కలెక్టర్ శ్రద్ధా శుక్లా తెలిపారు కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో 5కే రన్ కార్యక్రమ నిర్వహణపై వివిధ శాఖల అధికారులతో సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ట్రెయినీ కలెక్టర్ శ్రద్ధా శుక్లా మాట్లాడుతూ 16న ఉదయం 6 గంటలకు హనుమకొండలోని జేఎన్ఎస్ స్టేడియం నుండి రన్ ప్రారంభమై హనుమకొండ కలెక్టరేట్ వరకు కొనసాగుతుందన్నారు. ఈ పరుగులో విద్యార్థులు, యువత, అధికారులు, ఉద్యోగులు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. 5కే రన్ విజయవంతం చేసేందుకు అధికారులు సమన్వయంతో కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో స్వీప్ నోడల్ ఆఫీసర్ లక్ష్మీ రమాకాంత్, జిల్లా సంక్షేమ అధికారి మధురిమ, గ్రేటర్ వరంగల్ మునిసిపల్ కార్పొరేషన్ కాజీపేట డిప్యూటీ కమిషనర్ రవీందర్, జిల్లా యువజన, క్రీడల అధికారి అశోక్ కుమార్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఓటరుగా నమోదు చేసుకోవాలి

జిల్లా అడిషనల్ కలెక్టర్ రాధిక గుప్తా

18 ఏళ్లు నిండిన ప్రతీ ఒక్కరు ఓటరుగా నమోదు చేసుకోవాలని హనుమకొండ జిల్లా అడిషనల్ కలెక్టర్ రాధిక గుప్తా అన్నారు. హనుమకొండలోని కాకతీయ డిగ్రీ కళాశాలలో సోమవారం కొత్త ఓటర్ల నమోదు, ఓటింగ్ శాతాన్ని పెంచడంపై విద్యార్థులకు స్వీప్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అడిషనల్ కలెక్టర్ రాధిక గుప్తా మాట్లాడుతూ ఓటు హక్కు కలిగిన ప్రతి ఒక్కరు తప్పకుండా వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో ఓటు వేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ట్రెయినీ కలెక్టర్ శ్రద్ధా శుక్లా, స్వీప్ నోడల్ అధికారి, జిల్లా పంచాయతీ అధికారి లక్ష్మీరమాకాంత్, కేడీసీ ప్రిన్సిపాల్ రాజిరెడ్డి, డీఎల్‌పీవో సుదర్శన్, ఎంపీవో రవిబాబు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ వినోద్‌రావు పాల్గొన్నారు.

గంజాయి రవాణాను అరికట్టాలి

- వీడియో కాన్ఫరెన్స్‌లో మల్టీజోన్-1 ఐజీ రంగనాథ్



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న ఎస్పీ శబరీశ్, అధికారులు

ములుగు కలెక్టరేట్, ఏప్రిల్ 8: ములుగులో జిల్లాలో గంజాయి రవాణాను అరికట్టాలని మల్టీజోన్-1 ఐజీ ఎ.వి.రంగనాథ్ అన్నారు. ఎన్‌డీపీఎస్‌పై ములుగులోని జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పీ శబరీశ్, జిల్లా పోలీస్ అధికారులతో ఐజీ సోమవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఎన్‌డీపీఎస్ కేసుల నమోదు, డ్రగ్స్ సరఫరా నిలుపుదలకు తీసుకుంటున్న చర్యలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ జిల్లాలో యాంటీ డ్రగ్స్ కమిటీ ఏర్పాటుచేసి ఇప్పటికే 757.625 కిలోల గంజాయిని పట్టుకుని ధ్వంసం చేశామని, తెలిపారు. ఇటీవల మరిన్ని కేసులు నమోదు చేశామని అన్నారు. గంజాయి సరఫరాను అడ్డుకునే లక్ష్యంగా అంతర్రాష్ట్ర, జిల్లా రహదారుల వద్ద వాహనాలను తనిఖీ చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఆదివాసీలకు గంజాయి వాడకం పట్ల కలిగే దుష్పలితాలను వివరిస్తూ అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఐజీకి వివరించారు.

వీడియో కాన్ఫరెన్స్‌లో ఏటూరునాగారం ఏఎస్పీ గీతే మహేష్ బాబాసాహెబ్, ములుగు డీఎస్పీ రవీందర్, డీసీఆర్బీ డీఎస్పీ రాములు, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ శ్రీధర్, ములుగు, ఏటూరునాగారం, పస్రా సీఐలు రంజిత్‌కుమార్, రాజు, శంకర్, సీసీఎస్ సీఐ శ్రీనివాస్, ఎస్సైలు వెంకటేశ్వర్, రాజు, కమలాకర్, కృష్ణప్రసాద్, రవికుమార్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

శిక్షణ శిబిరాలకు దరఖాస్తుల ఆహ్వానం

వరంగల్ స్పోర్ట్స్, ఏప్రిల్ 8: స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ (సాట్) ఆదేశాల మేరకు హనుమకొండ జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ (డీఎస్ఏ) ఆధ్వర్యంలో మే 1 నుంచి 31 వరకు గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో నిర్వహించనున్న వేసవి శిక్షణ శిబిరాలను సద్వినియోగం చేసుకోవడానికి విద్యార్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు డీవైఎస్‌వో అశోక్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. నెల రోజుల పాటు ఉచితంగా నిర్వహించనున్న వేసవి శిక్షణ శిబిరంలో 4వ తరగతి నుంచి ఇంటర్ చదువుతున్న బాలబాలికలు పాల్గొనవచ్చన్నారు. ఈ శిబిరాల్లో శిక్షణ ఇచ్చేందుకు అనుభవజ్ఞులైన సీనియర్ క్రీడాకారులు, పీడీలు, పీఈటీలు ఈ నెల 25వ తేదీ వరకు జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ ఇండోర్ స్టేడియంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. హనుమకొండ జేఎన్ఎస్‌లో వివిధ క్రీడా అంశాల్లో నిర్వహించనున్న వేసవి శిక్షణ శిబిరంలో పే అండ్ ప్లే పద్ధతిన ప్రతీ రోజు ఉదయం 6 గంటల నుంచి 8 గంటల వరకు, సాయంత్రం 4 గంటల నుంచి 6 గంటల వరకు శిక్షణ అందించనున్నట్టు తెలిపారు. ఆసక్తి కలిగిన విద్యార్థులు శిక్షణ శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని అశోక్ సూచించారు.

టీజీ పేరిట కార్డుల జారీ



ఖిలావరంగల్, ఏప్రిల్ 8: కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన తెలంగాణ స్టేట్ (టీఎస్)ను మార్చి, తెలంగాణ ప్రభుత్వం (టీజీ)గా మార్చిన విషయం తెలిసిందే. ఇందులో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా టీజీ పేరిట నూతన లైసెన్సులు, వాహనాల రిజిస్ట్రేషన్ ప్రక్రియ ప్రారంభమైంది. వరంగల్ జిల్లాలోని రవాణాశాఖ కార్యాలయంలో రెండు రోజుల నుంచి వాహనాల లైసెన్సులు, వాహనాల రిజిస్ట్రేషన్‌లు తెలంగాణ ప్రభుత్వం (టీజీ) టీజీ-24, 0001 నుంచి కార్డులను వాహనదారులకు పంపిణీ చేస్తోంది. గత నెల 15 నుంచి టీజీ పేరిట ఆగిపోయిన కార్డులను ముంద్రించి వాహనదారులకు అందిస్తున్నారు. గత నెలలో నుంచి లైసెన్సులు, వాహనాల రిజిస్ట్రేషన్ చేసుకున్న వారికి త్వరలో వాహనదారులకు టీజీ పేరిట వాహనాల లైసెన్సులు, రిజిస్ట్రేషన్‌లు పోస్టు ద్వారా ఇంటికి చేరనున్నాయి.

శ్రీకరం.. శ్రీక్రోధి..

5వ పేజీ తరువాయి

చేదు అనుభవం కలిగిన దాన్ని స్వీకరించాలని తెలుపుతుంది. వేప పువ్వును తినడం వలన శరీరానికి ఎంతో మేలు కలిగించే ఔషధ గుణం ఉంటుంది. వగరు వసంతం అందించే పసందైన పంట మామిడి రుచితో కలిగి ఆరోగ్యానికి హాయిగా ఉంచే పదార్థం. ఉగాది పండుగను చేదు పండుగగా పిలుస్తారు. కొత్తగా పెళ్లైన జంటలు అల్లుళ్లు తొలి పండుగ ఉగాదికి అత్తారింటికి దూరంగా ఉంటారు. చేదు పండుగకు రావొద్దని ఉగాది పర్వదినానికి రారు.

జోరుగా పండగ సామగ్రి విక్రయాలు

ఉగాది పండగ సామగ్రి విక్రయాలతో మార్కెట్లు కిటకిటలాడాయి. మండల కేంద్రాలతోపాటు వరంగల్‌లోని ఆయా ప్రాంతాల్లో విక్రయాలు జోరందుకున్నాయి. వరంగల్‌లోని హెడ్ పోస్టాఫీస్, కాశిబుగ్గ, పోచమ్మమైదాన్, నర్సంపేట రోడ్, వరంగల్ చౌరస్తా, రామన్నపేట, ఎంజీఎం సెంటర్ తదితర ప్రాంతాలు కొత్త కుండలు, రంజన్‌ల విక్రయాలు జోరుగా సాగాయి. వరంగల్ హెడ్ పోస్టాఫీస్, చౌరస్తా ప్రాంతాలు పూల అమ్మకాలు పెద్దఎత్తున సాగాయి. ప్రధాన దారుల వెంట కొత్త చింతపండు, మామిడాకులు, మామిడికాయలు, ఇతర విక్రయాలతో సందడి సందడి మారాయి.

ఈసారి కోపతాపాలు ఎక్కువే..



డాక్టర్ సముద్రాల సుదర్శనాచార్యులు, ప్రముఖ జ్యోతిష్కుడు

కుజుడు అధిపతి కావడం శ్రీక్రోధి నామ సంవత్సరంలో కోపతాపాలు ఎక్కువే. ఈఏడు జిల్లాలో విస్తారంగా వర్షాలు కురుస్తాయి. ధాన్యం దిగుబడి అధికంగా ఉంటుంది. పాలు, వెండి, బంగారం, ఇనుము, సిమెంటు, పెట్రో, ఎలక్ట్రానిక్ వస్తువులు ధరలు పెరుగుతాయి. రియల్ ఎస్టేట్ వ్యాపారం మందగిస్తుంది. వరంగల్‌లో విమానాశ్రయం అందుబాటులోకి వస్తుంది. జిల్లాకు ఆదాయం 2, వ్యయం 8 కలుగుతుంది.

బెల్ట్‌షాపుపై టాస్క్‌ఫోర్స్ దాడులు



స్వాధీనం చేసుకున్న బాటిళ్లు

సంగెం, ఏప్రిల్ 8 : సంగెం మండలం గవిచర్ల గ్రామంలో టాస్క్‌ఫోర్స్ పోలీసులు బెల్ట్ షాపులపై సోమ వారం దాడులు నిర్వహించారు. టాస్క్‌ఫోర్స్ ఏసీపీ మధుసూదన్ ఆదేశాల మేరకు టాస్క్‌ఫోర్స్ సీఐ సార్ల రాజు, ఎస్ఐ ఎండీ నిజర్ పాషా, ఏఎస్ఐ వెంకటరెడ్డి, హెడ్ కానిస్టేబుల్ శ్రీనాథ్, పోలీసు కానిస్టేబుల్ నవీన్‌లు గ్రామంలోని రెండు బెల్ట్ షాపుల్లో దాడులు చేసి అక్రమంగా అమ్మకాలు చేస్తున్న మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. గ్రామంలో పోశాల కిశోర్ బెల్ట్ షాపులో రూ.9,580, పోశాల ఎల్లగౌడ్‌లకు చెందిన బెల్ట్ షాపులో రూ.15,110 విలువ గల మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు అధికారులు తెలిపారు. కేసు నమోదు చేసినట్లు సీఐ సార్ల రాజు తెలిపారు.

రంజాన్ సందడి



మండిబజార్‌లో బట్టల షాపువద్ద మహిళలు



మండిబజార్‌లో కంగన్‌హాల్‌లో విక్రయాలు

- బట్టల షాపులు కిటకిట
- సువాసనలు వెదజల్లుతున్న అత్తర్లు
- ఖీర్ మసాలాలకు భలే గిరాకి
- మండిబజార్‌లో విక్రయాల జోరు

కరీమాబాద్, ఏప్రిల్ 8: ముస్లింలకు అత్యంత పవిత్రమైన రంజాన్ పండుగ దగ్గర పడుతుండడంతో నగరంలో సందడి నెలకొంది. మండిబజార్ ప్రాంతంలోని వివిధ షాపులు ముస్లింల విక్రయాలతో కోలాహలంగా మారాయి. బట్టల షాపులు మహిళలతో కిటకిటలాడుతున్నాయి. వివిధ రకరకాల మాడల్స్‌లో చీరలు, డ్రెస్‌లు అందుబాటులో ఉన్నాయి. షాపింగ్ మాల్స్‌తో పాటు షాపులు పండుగ ఆఫర్లు ప్రకటించడంతో విక్రయాలు జోరందుకున్నాయి. డ్రెస్ మెటీరియల్స్ కొందరు ఇష్టప డితే మరికొందరు రెడీమెడ్ డ్రెస్‌లకు ఆసక్తిని కనబరు స్తున్నారు. రూ.500 నుంచి ప్రారంభమైరూ.10వేల విలు వచేసే మోడల్స్ అందుబాటులో ఉన్నాయి. చూడిదార్ లు, పటియాలా, బాజీరావు, మస్తానీ, రకరకాల మోడ ల్స్ అందుబాటులో ఉన్నాయి. పిల్లలు కోసం రూ. 500 నుంచి రూ.5వేల వరకు వివిధ ధరల్లో లాంగ్, షార్ట్, ఫ్రాక్‌లు, నెట్టెడ్, జీన్స్ ప్రత్యేకమైన టాప్స్‌తో చిన్నారు లకు ట్రెండ్‌కు అనుగుణంగా అందుబాటులో ఉన్నాయి. అలాగే చెప్పుల షాపులు కూడా కిటకిటలాడుతున్నాయి.





ఆకట్టుకుంటున్న ఫ్యాన్సీ హారాలు..

చిన్నా పెద్దా తేడా లేకుండా మహిళలు ఇష్టపడే ఆభరణాలు, గాజులు, ఫ్యాన్సీ హారాలు సందడి చేస్తున్నాయి. స్టోన్‌వర్క్‌తోపాటు పూసలు, సాదా హారాలు, బ్యాం గిల్స్ స్టోర్స్‌ల వద్ద కొనుగోలు చేసే మహిళతో మండిబ జార్ ప్రాంతం కిక్కిరిసిపోయింది. వ్యాపారులు చెన్నై, ముంబై, హైదరాబాద్, ఢిల్లీ, తదితర ప్రాంతాల నుంచి సరికొత్త మోడల్స్‌ను తీసుకొచ్చి మండిబజార్‌లో విక్రయి స్తున్నారు. రూ.150 నుంచి మొదలు రూ.2వేల వరకు వివిధ ధరల్లో అందుబాటులో ఉన్నాయి. అలాగే నిత్యం ఫార్మల్, ఫ్యాన్సీ జీన్స్, డ్రస్సులు, స్కిన్‌టైట్, న్యారో, పెన్సిల్ ఫిట్, మోడళ్లలో కనిపించే యువకులు రంజాన్ రోజున సంప్రదాయానికి దగ్గరగా ఉండే మోడరన్ డిజై న్ దస్తులు ధరించేందుకు ఆసక్తి కనబరుస్తారు. వారికి తగ్గట్టుగా డ్రెస్సులు షాపుల్లో అందుబాటులో ఉన్నాయి.

సువాసనలు వెదజల్లె అత్తర్లు..



ముస్లింలు అమితంగా ఇష్టపడే వాటిల్లో ప్రధానమైనది అత్తరు. ఏ పండుగైన అత్తర్ల కొనుగోలు ఎక్కువగా ఉంటాయి. రకరకాల అత్తర్లు సువాసనలు వెదజల్లుతున్నాయి. గుజరాత్, ఢిల్లీ, బొంబాయి, హైదరాబాద్, తదితర ప్రాంతాల నుంచి దిగుమతి అత్తర్లు దిగుమతి చేసుకున్నారు. 7ఎంఎల్ ధర రూ. 50 నుంచి రూ.వెయ్యి వరకు ఉండడం గమనార్హం.

ఖీర్ మసాలాలకు భలే గిరాకీ....

రంజాన్ పండుగ అనగానే ముందుగా గుర్తొచ్చేది నోరూరించే పాయసం. పాయసంలో వాడే ఖీర్ మసాలాలు, డ్రై ఫ్రూట్స్, సేమియాల్లో పలు రకాల వెరైటీలకు మార్కెట్లో భలే డిమాండ్ ఉంటుంది. ఖీర్ మసాలాలు కొనుగోలు చేసేందుకు ముస్లీంలు ఆసక్తి కనబరుస్తుండటంతో మండి బజార్‌లో రద్దీ నెలకొంది.



8సంగెం1: మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి

కార్యకర్తల్ని కంటికి రెప్పలా కాపాడుకుంటా

సంగెం, ఏప్రిల్ 8: ప్రతీ కార్యకర్తలను కటికి రెప్పలా కాపాడుకుంటానని పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి అన్నారు. సోమవారం హనుమకొండలోని తన నివాసంలో మండలానికి చెందిన ముఖ్యకార్యకర్తల సమావేశం జరిగింది. చల్లా మాట్లాడుతూ నియోజకర్గంలో బీఆర్ఎస్‌కు మంచి ఆదరణ ఉందని, పార్టీని నమ్ముకుని ఇంతకాలం ఉన్న వారికి తగిన ప్రాధాన్యమిస్తామన్నారు. స్వార్థంతో కొందరు పార్టీని వీడినా నష్టం లేదన్నారు. పార్లమెంటు ఎన్నికల్లో అధిష్టానం సూచించిన అభ్యర్థి గెలుపునకు ప్రతీ కార్యకర్త సైనికుడిలా పనిచేయాలన్నారు. కార్యక్రమంలో సంగెం జడ్పీటీసీ గూడ సుదర్శన్‌రెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు పసునూరి సారంగపాణి, వైస్ ఎంపీపీ బుక్క మల్లయ్య, పులుగు సాగర్‌రెడ్డి, బొంపెల్లి దిలీప్‌రావు, వదోనికెల మల్ల య్య, మాజీ జడ్పీటీసీ గుగులోతు వీరమ్మ, ఉండీల రాజు, షాబోతు శ్రీనివాస్, కత్తి రమేష్ తదితరులు పాల్గొన్నారు.



మట్టి పాత్రలు అందజేస్తున్న శాలివాహనులు

భద్రకాళికి మట్టిపాత్రలు

కరీమాబాద్, ఏప్రిల్ 8: భద్రకాళి దేవస్థానానికి నగరంలోని ఉర్సు ప్రాంతానికి చెందిన శాలివాహనులు సోమవారం తమ కుల సంప్రదాయం ప్రకారం ఉగాది పర్వదినం సందర్భంగా ఉగాది పచ్చడి కోసం నూతన మట్టి పాత్రలు సమర్పించారు. శాలివాహనుల (కుమ్మరుల) ఆధ్వర్యంలో అనాదిగా వస్తున్న ఆచారంలో భాగంగా ప్రతి ఏడాది భద్రకాళి దేవస్థానానికి మట్టిపాత్రలు సమర్పించే సంప్రదాయాన్ని నేటికి కొనసాగిస్తున్నట్లు వారు తెలిపారు. ఈ మట్టిపాత్రలను ఆలయంలోని అర్చకులకు అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో కుమ్మరులు అవుసూరి రామ్మూర్తి, రుద్రారపు కుమార స్వామి, అవుసూరి నాగరాజు, సముద్రాల రాజు, బొడ్డుపెల్లి శ్రీకాంత్ తదితరులు ఉన్నారు.

సర్వే క్రాస్‌చెక్‌ను అడ్డుకున్న రైతులు

గీసుగొండ, ఏప్రిల్8: నేషనల్ గ్రీన్‌ఫీల్డ్ హైవే కోసం కొద్దినెలల క్రితం రెవెన్యూ అధికారుల సర్వే చేశారు. సోమవారం అధికారులు సర్వే భూములను మరోసారి క్రాస్‌చెక్ చేసేందుకు వెళ్లగా స్థానిక భూనిర్వాసితులు అడ్డుకొని వాగ్వాదానికి దిగారు. మనుగొండ, మచ్చాపూర్, ఊకల్ రెవెన్యూ పరిధిలోని నిర్వాసితులకు ఎకరానికి రూ.18లక్షలు, గీసుగొండ రెవెన్యూ పరిధిలో రూ.27 లక్షలు నష్టపరిహారం చెల్లించేలా నేషనల్ హైవే అథారిటీ, రెవెన్యూ అధికారులు నిర్ణయించారు. ఇప్పటికే కొంతమందికి నష్టపరిహారం చెల్లించారు. నిర్వాసితుల సర్వేనంబర్ వివరాలను మరోసారి చెక్ చేసేందుకు రెవెన్యూ అధికారులు సోమవారం ఫీల్డ్‌కు వెళ్లారు. ఈ విషయాన్ని తెలుసుకున్న రైతులు అక్కడికి వెళ్లి నష్టపరిహారం సరిపోదంటూ అధికారులతో వాగ్వాదానికి దిగారు. సర్దిచెప్పడంతో వారు శాంతించారు.



జాతరను సందర్శించి పరిశీలిస్తున్న ఏసీపీ తిరుపతి

బ్రహ్మయ్య జాతర సక్సెస్ చేయాలి

సంగెం, ఏప్రిల్ 8 : గవిచర్లలోని బ్రహ్మయ్య జాతరలో ఎలాంటి అవాంచనీయ ఘటనలు జరగకుండా విజయవంతం చేయాలని మామునూరు ఏసీసీ తిరుపతి కోరారు. జాతరలో రాజకీయ ప్రభబండ్లు, నిషేధించినట్లు చెప్పారు. శాంతియుతంగా జాతరకు వచ్చే భక్తులు, రాజకీయ పార్టీలు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో పర్వతగిరి సీఐ శ్రీనివాస్, సంగెం ఎస్ఐ నరేష్, ఆలయ కమిటీ చైర్మన్ కొంతం యాదగిరి, ఎంపీటీసీ గూడ సంపత్ రెడ్డి పాల్గొన్నారు.

» సమస్యాత్మక గ్రామాల్లో ఓటింగ్ శాతం పెంచాలని ఏసీపీ తిరుపతి కోరారు. గవిచర్ల ఉన్నత, ప్రాథమికోన్నత ప్రభుత్వ పాఠశాలలను పర్వతగిరి సీఐ శ్రీనివాస్, ఎస్ఐ నరేష్‌లతో కలిసి పరిశీలించారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని సమస్యాత్మకంగా గుర్తింపు చేసిన పోలింగ్ కేంద్రాల్లో ఓటింగ్‌ను ప్రశాంతంగా నిర్వహిచడం కోసం బలగాలను నియమించినట్లు వివరించారు.

జిల్లా ప్రేరణ పోటీల నిర్వహణ



మాట్లాడుతున్న శ్రీనివాస్

వరంగల్ ఎడ్యుకేషన్, ఏప్రిల్ 8: జిల్లాస్థాయి ప్రేరణ ఉత్సవ ఎంపిక కార్యక్రమాన్ని సోమవారం మామునూరులోని జవహర్ నవోదయ విద్యాలయంలో నిర్వహించారు. వరంగల్, ములుగు జిల్లాల 9వ తరగతి నుంచి ఇంటర్ చదువుతున్న బాలబాలికలను ఎంపిక చేసినట్లు చక్రవర్తుల శ్రీనివాస్ తెలిపారు. ప్రతీ పాఠశాల నుంచి ఇద్దరు చొప్పున ఎంపిక చేసినట్లు తెలిపారు. ఎంపికైన విద్యార్థులు గుజరాత్‌లో జరిగే ప్రేరణ ప్రయోగాత్మక అభ్యసనలో పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో గుండు రవి పాల్గొన్నారు.

అన్నదానం ఎంతో గొప్పది

మట్టెవాడ, ఏప్రిల్ 8: అన్ని దానాల్లోకెల్లా అన్నదానం గొప్పదని మట్టెవాడ సీఐ తుమ్మ గోపిఅన్నారు. సోమవారం అమవాస్య సందర్భంగా మట్టెవాడలోని ముకుంబిత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో గోపాలస్వామి గుడి జంక్షన్‌లో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు దొడ్డ రమేశ్, లావణ్య, దివ్వెల పూర్ణచందర్, చిదర నాగరాజు, ఇరుకుళ్ళ రమేశ్, ఇరుకుళ్ళ నాగేశ్వర్‌రావు, పోల ఉమామహేశ్వర్, అరవింద్, నూతన్, రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

'విశ్వేశ్వరయ్య' కాలేజీలో కవి సమ్మేళనం



ఉగాది కవి సమ్మేళనంలో పాల్గొన్న కవులు

గిర్మాజీపేట, ఏప్రిల్ 8: నగరంలోని శ్రీ విశ్వేశ్వరయ్య సంస్కృతాంధ్ర డిగ్రీ, పీజీ కళాశాలలో సోమవారం ఉగాది కవి సమ్మేళనం జరిగింది. ప్రిన్సిపాల్ ఎస్.సతీష్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమాన్ని పాలకవర్గం అధ్యక్షులు ఆకారపు హరీష్, కార్యదర్శి ఆచార్య చిలుకమారి సంజీవలు జ్యోతి ప్రజ్వలన చేశారు. ముఖ్యఅతిథి, కళాశాల రిటైర్డ్ ప్రిన్సిపాల్ యల్లంభట్ల నాగయ్య మాట్లాడుతూ తెలుగు సంప్రదాయాలను ముందు తరాలకు అందించేలా ఆకారపు చెన్నవిశ్వేశ్వర్‌రావు ఈ కళాశాలను ప్రారంభించారన్నారు. క్రోధి నామ విశిష్టతను వివరించారు. అనంతరం కవులు ఆచార్య రామచంద్రమౌళి, కంది శంకరయ్య, కాగితం సారంగపాణి, తాండ్ర చిరంజీవి, పొతూరి రఘురామయ్య, ఆడెపు చంద్రమౌళి, వేణుగోపాలాచార్య, వలస పైడి, పొదిల కార్తీక్ క్రోధి నామసంవత్సరంపై కవితలను వినిపించారు. అనంతరం కవులను కళాశాల పాలకవర్గం సత్కరించింది. కార్యక్రమంలో కళాశాల పాలకవర్గం సభ్యులు డాక్టర్ బండారు ఉమమహేశ్వర్‌రావు, కళాశాల అధ్యాపకులు పి.రంగాచార్యులు, మేకల లింగమూర్తి, పి.జయకృష్ణ, శ్రీధర్ల కుమార స్వామి, శెట్టి దేవరాజు, వై.సుస్మిత, రవిందర్, రాజు, లింగయ్య పాల్గొన్నారు.

తీర్మానం ఉల్లంఘన.. ప్రశ్నించిన లారీ ఓనర్‌పై దాడి

గీసుగొండ, ఏప్రిల్ 8: యూనియన్ తీర్మానాన్ని ఉల్లంఘించి లారీలో సిమెంట్ లోడ్ చేయడాన్ని ప్రశ్నించిన లారీ ఓనర్‌పై దాడి జరిగిన ఘటన సోమవారం చోటు చేసుకుంది. బాధితుడు ఠాకూర్ రాకేష్‌సింగ్ కథనం ప్రకారం వివరా లు ఇలా ఉన్నాయి. ఆదివారం రాత్రి వరంగల్ రైల్వేగూడ్స్ వద్ద సిమెంట్‌నులోడ్ చేశారు. లారీ అసోసియేషన్ తీర్మానం ప్రకారం లారీలో కేవలం 15 టన్నులు మాత్రమే లోడింగ్ చేయాలి. లారీ అసోసియేషన్ అధ్యక్షుడు ఫిరోజ్‌అలీకి చెందిన ఈ లారీలో 25టన్నుల సిమెంట్‌ను లోడ్ చేశారు. గమ నించిన యూనియన్ సభ్యుడు ఠాకూర్ రాకేష్‌సింగ్‌తోపాటు మరికొందరు దీనిపై ప్రశ్నించారు. తర్వాత లోడింగ్ అయిన లారీని అదేరోజు రాత్రి ధర్మారం వద్ద గల యూనియన్ క్యాంప్‌కు తరలించారు. సోమవారం ఉదయం వెళ్లిచూడగా లారీ లేకపోవటంతో రాకేష్, ఇతర సభ్యులు వాచ్‌మెన్‌ను ఆరా తీశారు. ఆదివారం రాత్రే లారీని ఓనర్ ఫిరోజ్ అలీ తీసుకెళ్లినట్లు చెప్పాడు. తర్వాత ఇదే విషయాన్ని యూనియన్ సభ్యులతో చర్చిస్తుండగా అసోసియేషన్ అధ్యక్షుడి బంధువులు ఎండీ ఫారూక్‌అలీ, ఎండీ హర్షత్ అలీ, ఎండీ యాకూబ్, ఎండీ ఆసీఫ్‌అలీలు రాకేష్‌పై విచక్షణారహితంగా దాడి చేశారు. దీంతో తోటి సభ్యులు 100సమాచారం ఇవ్వడంతో పోలీసులు ఘటనాస్థలానికి చేరుకున్నారు. గాయపడిన రాకేష్‌ను చికిత్స కోసం ఎంజీఎంకు తరలించారు. సీఐ పవన్ కుమార్‌ను వివరణ అడుగగా ఇరువర్గాలు ఒకరిపైఒకరు ఫిర్యాదు చేసినట్లు చెప్పారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో ఇద్దరికి జైలు

మట్టెవాడ, ఏప్రిల్ 8: మద్య తాగి వాహనం నడిపిన కేసులో ఇద్దరికి జైలు శిక్ష విధిస్తూ వరంగల్ సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ గుర్రాపు వీరస్వామి తీర్పు ఇచ్చినట్లు వరంగల్ ట్రాఫిక్ సీఐ కె.శ్రీధర్ తెలిపారు. కాశిబుగ్గకు చెందిన ఓర్సు ఎల్లస్వామి, వరంగల్‌ఎల్లూరు రంగంపేటకు చెందిన గుగులోత్ సోమయ్యలు మద్యం తాగి వాహనం నడుపుతూ వరంగల్‌లో ట్రాఫిక్ పోలీసులకు పట్టుపడ్డారు. సోమవారం మేజిస్ట్రేట్ ఎదుట ప్రవేశ పెట్టగా మేజిస్ట్రేట్ గుర్రాపు వీరాస్వామి సోమయ్య, ఎల్లస్వామిలకు రెండు రోజుల జైలు శిక్షను విధించారు. వీరిని మహబూబాబాద్ సబ్‌జైల్‌కు తరలించినట్లు ట్రాఫిక్ సీఐ కె.శ్రీధర్ తెలిపారు.

ఘనంగా చండీహోమం



వరంగల్ సిటీ, ఏప్రిల్ 8: కాశిబుగ్గలోని శ్రీ రంగనాథ స్వామి దేవాలయంలో సోమవారం అమావాస్య సందర్భాన్ని పురస్కరించుకుని ఆలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు వంగరి రవి ఆధ్వర్యంలో చండీహోమం నిర్వహించారు. భూపాలపల్లి అడిషనల్ ఎస్పీ శ్రీనివాస్ ఆలయాన్ని సంద ర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అన్నదా న కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో కమిటీ ప్రధాన కార్యదర్శి చిలుపూరి సురేష్, కోశాధికారి సుల్తానా సమ్మక్క, అర్చకులు ఆరుట్ల కిష్టమాచార్యులు, సభ్యులు మౌ టం శ్రీనివాస్, కోల కవిత, మంచాల శ్రీను, సుజన, వంగరి సమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

బల్దియా వెహికిల్ షెడ్ తనిఖీ

వరంగల్ కార్పొరేషన్, ఏప్రిల్ 8: వరంగల్ మునిసిపల్ కార్పొరేషన్ పరిధిలో బాలసముద్రంలో నిర్వహించే వెహికల్ షెడ్డును నగర పాలక సంస్థ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే సోమవారం క్షేత్రస్థాయిలో తనిఖీ చేశారు. అక్కడ విధులు నిర్వర్తించే సిబ్బంది పనితీరును వివరాలు అడిగి తెలుసుకున్నారు.హాజరు ఇరిజిస్ట్రర్‌ను పరిశీలించారు. ఎన్ని వాహనాలు తుప్పుపట్టి ఉన్నాయి? ఎన్ని వాహనాలు మరమ్మతుకు నోచుకోకుండా ఉన్నాయి? అని అక్కడి సిబ్బందిని అడిగారు. మరమ్మతుకు వచ్చే వాహనాలు వెంటనే రిపేరు చేసి పంపించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడారు. చెత్త తరలింపు వాహనాలు మరమ్మతుకు వచ్చిన నేపథ్యంలో రిపేరు చేసి పంపించాలన్నారు. ఇంకా వాహన కర్మాగారంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలన్నారు.

'వంగపల్లికి ఎంపి టికెట్ ఇవ్వాలి'

కాళోజీ జంక్షన్, ఏప్రిల్ 8: రిజర్వ్‌డ్ స్థానమైన వరంగల్ లోక్‌సభ టికెట్‌ను వంగపల్లి శ్రీనివాస్‌కు కేటాయించి మాదిగల ఆత్మగౌరవాన్ని నిలుపాలని ఎమ్మార్పీఎస్- టీఎస్ రాష్ట్ర యువసేన అధ్యక్షుడు, కోర్ కమిటీ సభ్యులు పొట్ట పెంజర రమేశ్ మాదిగ బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌కు విజ్ఞప్తి చేశారు. సోమవారం హనుమకొండ రాయల్ గార్డెన్స్ సమీపంలోని పార్టీ కార్యాలయంలో నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు.

విజయచందర్ రెడ్డి జన్మదిన వేడుకలు



సంగెంలో కేక్ కట్ చేస్తున్న బీజేపీ నాయకులు

సంగెం, ఏప్రిల్ 8 : సంగెంలోని అంబేద్కర్ సెంటర్‌లో సోమవారం బీజేపీ నేత విజయచందర్‌రెడ్డి జన్మదిన వేడుకలు నిర్వహించారు. కేక కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి మొలుగూరి భిక్షపతి, నాయకులు కుమార స్వామి, రహమతుల్లా, చేరాలు, దేవేందర్‌రెడ్డి, పైడి, సమ్మిరెడ్డి, వీరయ్య, ముకుంధా, సతీష్, సతీష్, ప్రభాకర్, రాజు, రాంబాబు, అశోక్, రాజన్; సాయి శేఖర్ పాల్గొన్నారు.

'ఆ స్కూల్ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలి'


డీఈవోకు వినతి పత్రం అందిస్తున్న విద్యార్థి సంఘాల నాయకులు

నర్సంపేట టౌన్, ఏప్రిల్ 8 : ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా పాఠశాల నిర్వహిస్తున్న నర్సంపేట పట్టణంలోని ఓ ప్రైవేట్ స్కూల్ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ఏఐఎస్ఎఫ్, పీడీఎస్ఎఫ్, ఏటీఎస్ఎఫ్, ఏఐఎఫ్డీఎస్, ఏఐఎస్బీ విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో సోమవారం డీఈవో వాసంతికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా నర్సంపేటలో ఏర్పాటు చేసినసమావేశంలో ఏబీఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి బొట్ల నరేష్ మాట్లాడుతూ పాఠ్యపుస్తకాలపై తన స్కూల్ పేరుతో ముద్రించి విక్రయాలకు సిద్ధమవుతున్నారని, నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్న ఆ పాఠశాల యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రవీణ్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

ఎండలు ఎక్కువగా ఉంటాయి

తాగునీటిపై దృష్టిసారించాలి : ఏసీఎల్బీ సంధ్యారాణి


అప్పల్‌రావుపేటలో జీపీ మంచినీటి బావిని పరిశీలిస్తున్న ఏసీఎల్బీ సంధ్యారాణి

నెక్కొండ, ఏప్రిల్ 8: రాబోయే రోజుల్లో రోజు రోజుకు ఎండల తీవ్రత పెరుగుతుందని, ప్రజలకు తాగు నీటి సరఫరాలో ఇబ్బందులు కలుగకుండా గ్రామాల ప్రత్యేకాధికారులు ముందస్తు ఏర్పాట్లు చేసుకోవాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ జి.సంధ్యారాణి ఆదేశించారు. ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం జరిగిన ప్రత్యేకాధికారుల సమావేశంలో ఆమె మాట్లాడారు.ప్రస్తుతం గ్రామాలకు సరఫరా అవుతున్న మిషన్ భగీరథ తాగు నీరు గ్రామాల్లో, శివారు గిరిజన తండాల్లో సరిపోతున్నాయా లేదా అనే విషయాన్ని ప్రత్యేకాధికారులు తెసులుసుకోవాలని సూచించారు. తాగునీటి సరఫరాకు గ్రామాల్లో ప్రత్యామ్నాయంగా గ్రామ పంచాయతీల పరిధిల్లోని బావులను శుభ్రపరిచి క్లోరినేషన్‌చేయాలని, జీపీ పరిధుల్లో బావులులేని గ్రామాల్లో వ్యవసాయ బావులను అద్దెకు తీసుకొని సిద్ధంచేయాలన్నారు. మండలంలోని అప్పల్‌రావుపేట గ్రామంలో మంచినీటి బావులను పరిశీలించిన అనంతరం తాగునీటి సరఫరా విషయమై గ్రామంలోని మహిళలను ఏసీఎల్బీ సంధ్యారాణి అడిగి తెలుసుకున్నారు. తాగునీటి సరఫరాలో గ్రామ కార్యదర్శులు ఎలాంటి అలసత్వం పాటించిన వారిపై కఠిన చర్యలు తప్పవన్నారు. గ్రామాల వారీగా తాగునీటి సరఫరా చర్యలపై సమీక్షించడంతో పాటు లోటుపాట్లు ఉన్న గ్రామాల్లో తీసుకోవలసిన చర్యలను వివరించారు. జిల్లా వ్యవసాయశాఖ జేడీఏ, మండల ప్రత్యేకాధికా ఉషాదయాల్, ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్, ఎంపీవో సునిల్‌రాజ్, మిషన్ భగీరథ ఏఈ రాజేష్, వివిధ శాఖల అధికారులు, గ్రామల కార్యదర్శులు పాల్గొన్నారు.

• వేసవిలో తాగునీటి ఎద్దడి లేకుండా చూడాలి

వర్ధన్నపేట రూరల్: వేసవిలో పట్టణ ప్రజలకు తాగునీటి సమస్యలు లేకుండా చూసుకోవాలని వరంగల్ అడిషనల్ కలెక్టర్ సంధ్యారాణి సూచించారు. సోమవారం పట్టణంలో తాగునీటిపై సమీక్ష సమావేశం నిర్వహించి, ఫీల్డ్ విజిట్ చేశారు. మరమ్మతులో ఉన్న తాగునీటి పైపు లైన్లను పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ వేసవి కాలాన్ని దృష్టిలో పెట్టుకుని అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు.

ఇంటి పన్నుల వసూళ్లపై శ్రద్ధపెట్టాలని, నూతన సంవత్సరంలో 5శాతం రాయితీతో పట్టణ ప్రజలు పన్నులు చెల్లించేలా చూడాలన్నా రు. ఆదాయ వ్యయాలపై సమావేశం ఏర్పాటు చేసి త్వరితగతిన పనులు పూర్తిచేసే లా చూడాలన్నారు. డ్రైనేజీ, పారిశుధ్యంపై అధికారులు దృష్టి సారించాలన్నారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ కమిషనర్ ఇ.జోనా, సిబ్బంది పాల్గొన్నారు.

ఎండా... వానల... దేవుడికి దిక్కెవరు?

500 ఏళ్ల చరిత్ర గల ఆలయం...

వెంకన్న స్వామి అభివృద్ధిని వెనక్కినెట్టిన పాలకులు


వేంకటేశ్వరస్వామి ఆలయం

వర్ధన్నపేట రూరల్, ఏప్రిల్ 8 : అవును ఆయన ఎండా.. వానల.. దేవుడు. కానీ, ఆయనకు మాత్రం ఎవరు దిక్కులేరు. నల్లరాతిపై వెలసిన వేంకటేశ్వరస్వామి మహిమలు అన్నీ ఇన్నీ కావు. ఊరికి చివరన ఉందిలే కదా అని, ఎందుకు అభివృద్ధి చేయాలని పాలకులు అనుకున్న, దాతలు మాత్రం మహిమల దేవుడు మా వెంక న్న స్వామి అంటూ వారికి తోచిన విధంగా సహాయ సహకారాలు అందిస్తున్నారు. పాలకులు గెలిచినప్పుడల్లా ఆలయాన్ని దర్శించుకుని అభివృద్ధి చెస్తామని చెప్పడం తప్ప, ఆచరణకు నోచుకోవడం లేదు. వర్ధన్నపేట మునిసి పాలిటీగా మారినా ఇక్కడి ఆలయాలపై ప్రభుత్వం, ప్రజా ప్రతినిధులు శీతకన్ను ప్రదర్శిస్తున్నారు.

విదేశాల వెంకన్నగా ప్రతీక...

కోరిన కోరికలు తీరుస్తూ ప్రజలను సుఖ సంతోషాలతో ఉంచుతున్నాడని, విదేశాలకు వెళ్లే వారు కూడా స్వామి వారికి మొక్కుకుంటే విదేశాలకు వెళ్లేందుకు అను కూలంగా పనులు జరుగుతాయని భక్తుల విశ్వాసం. దీంతో విదేశాల వెంకన్న అని కూడా స్థానికులు పిలుస్తారు. వరంగల్ జిల్లా వర్ధన్నపేట నియోజకవర్గ కేంద్రానికి కిలోమీటర్ దూరంలో ఉంటూ వరంగల్ ఖమ్మం జాతీయ రహదారికి కూతవేటు దూరంలో ఉన్న శ్రీ వేంకటేశ్వరస్వామి, అలివేలు మంగ, పద్మావతిల సతిసమేతంగా 500ఏళ్ల క్రితం వెలసినట్లుగా గ్రామ పూర్వీకులతో పాటు అర్చకులు చెపుతున్నారు. నల్లరాతిపై వెలసిన వెంకన్న స్వామి అభివృద్ధిని పాలకులు వెనక్కి నెట్టారు. ఎంతమంది పాలకులు మారినా, ఆ ఎండా వానల దేవుడి ఆలయ ప్రాంగణం మాత్రం ఇప్పటివరకు అలాగే ఉంది. ఆహ్లాదకరమైన వాతావరణంలో వెలసిన వేంకటేశ్వరస్వామి చుట్టూ పచ్చటి చెట్ల నడుమ పూజలు అందుకుంటున్నాడు.

పై కప్పు వేస్తే స్వామివారికి ఆగ్రహం...

ఈ ఆలయ ప్రత్యేకత స్వామివారికి పై కప్పు లేకపోవడమే. పూర్వ కాలంలో నల్లరాతిపై వెలిసినట్లుగా కళలోకి వచ్చి స్వామి చెప్పడంతో ఓ భక్తుడు గ్రామస్థులతో చెప్పి వెంకన్న స్వామికి పై కప్పును ఏర్పాటు చేసి తాత్కాలికంగా ఆలయ నిర్మాణం చేశాడు. ఏర్పాటు చేసిన 24 గంటల్లోనే పైకప్పు ప్రకృతి వైపరీత్యంతో కూలిపోయింది. దీంతో మళ్లీ కప్పును నిర్మించినా మళ్లీ అలానే కూలిపోయింది. ఒక రోజు మళ్లీ స్వామివారు భక్తుల కలలోకి వచ్చి నేను ఎండా.. వానల.. దేవున్ని, ఎండలో ఎండుతాను, వానలో తడుస్తాను, నాకు పై కప్పు అవసరం లేదు. నాకు ఇలాగే పూజలు చేయండి అని చెప్పడంతో ఆనాటి నుంచి నేటి వరకు గ్రామస్థులు, భక్తులు అలాగే పూజలు చేస్తున్నారు. ప్రతీ శనివారం ఆలయ అర్చకుడు సంపతాచార్యులు ప్రత్యేక పూజలు చేసి తీర్థప్రసాదాలు అందిస్తారు. శ్రావణమాసంలో ప్రతీ శనివారం భక్తుల రద్దీ ఎక్కువగా ఉంటుంది.

దాతల సహకారం...

గ్రామ శివారులో ఉన్న శ్రీ వేంకటేశ్వరస్వామి దేవాలయానికి పట్టణానికి చెందిన అన్నమనేని సునిత హేమచందర్‌రావు దంపతులు ఆలయ ప్రాంగణం చుట్టూ ప్రహరీ గోడను, వాటర్ ట్యాంక్‌ను నిర్మించారు. మండలంలోని ఇల్లంద గ్రామానికి చెందిన అడుప కనకయ్య స్మారకార్థం చంద్రమౌళి, సోమలక్ష్మి, వరలక్ష్మి కుటుంబ సభ్యులు స్వామివారి దేవాలయానికి ఎదురుగా కల్యాణ మండపాన్ని నిర్మించారు. వర్ధన్నపేట మాజీ జడ్పీటీసీ పాలకుర్తి సారంగపాణి గతంలో జడ్పీటీసీగా ఉన్నప్పుడు మంచినీటి బోరును ప్రభుత్వ నిధులతో వేయించాడు. వంటశాల కోసం కొంతమంది దాతలు ముందుకు వచ్చి గదిని నిర్మించారు.


నిరుపయోగంగా నీటి ట్యాంకు

పట్టణంలోని ఆలయాలపై శీతకన్ను...

వర్ధన్నపేట మునిసిపాలిటీ పరిధిలో వేంకటేశ్వరస్వామి ఆలయంతో పాటు సీతారామచంద్రస్వామి ఆలయం, శివాలయం, బాలాంజనేయ స్వామి ఆలయం, సాయిబాబా ఆలయాలు ఉన్నాయి. వీటి అభివృద్ధికి గత ప్రభుత్వాలు శీతకన్ను ప్రదర్శించాయి. భక్తుల సంఖ్య రోజురోజుకూ పెరుగుతున్నా వాటి అభివృద్ధికి ప్రజాప్రతినిధులు, అధికారులు దృష్టి సారించడం లేదు.

ధ్వజస్తంభం ఏర్పాటు చేయాలి...

శేషం సంపతచార్యులు, ఆలయ అర్చకుడు వర్ధన్నపేట



500 ఏళ్ల క్రితం వెలిసిన వెంకన్న స్వామికి, అప్పటి నుంచి రాతి ధ్వజస్తంభమే ఉంది. అది కాస్తా ఇప్పుడు శిథిలావస్థకు చేరుకుంది. నూతనంగా ధ్వజస్తంభాన్ని ఏర్పాటు చేయాలి. ఎంతో సువిశాల ఆలయం ఇక్కడ తప్ప మరెక్కడ ఉండదు. ఆలయ ప్రాంగణాన్ని పాలకులు, దాతలు భక్తులు సేదతీరేలా మొక్కలు నాటి గార్డెన్‌లా చేయాలి. చుట్టూ పక్కల ఉన్న పిచ్చి చెట్లను తొలగించి ఆలయం ప్రధాన రహదారి వరకు కనిపించేలా చర్యలు తీసుకోవాలి.

అధికారులు చొరవ తీసుకోవాలి...

నేరెళ్లి యాకయ్య, భక్తుడు, వర్ధన్నపేట



ప్రజాప్రతినిధులు వస్తున్నారు, వెళ్తున్నారే తప్పా పట్టించుకోవడం లేదు. దీనిపై అధికారులు ప్రత్యేక చొరవ తీసుకుని అభివృద్ధిచేయాలి. మహిమ గల వెంకటేశ్వరస్వామి ఆలయాన్ని వందల మంది భక్తులు వచ్చి దర్శించుకుంటున్నారు. కానీ, ఇక్కడ కనీస వసతులు కూడా లేకపోవడంతో నిరాశతో వెనుదిరుగుతున్నారు.

శ్రీకరం.. శ్రీక్రోధి..

(5వ పేజీ తరువాయి)

చేదు అనుభవం కలిగిన దాన్ని స్వీకరించాలని తెలుపుతుంది. వేప పువ్వును తినడం వలన శరీరానికి ఎంతో మేలు కలిగించే ఔషధ గుణం ఉంటుంది. వగరు వసంతం అందించే పసందైన పంట మామిడి రుచితో కలిగి ఆరోగ్యానికి హాయిగా ఉంచే పదార్థం. ఉగాది పండుగను చేదు పండుగగా పిలుస్తారు. కొత్తగా పెళ్లైన జంటలు అల్లుళ్ల తొలి పండుగ ఉగాదికి అత్తారింటికి దూరంగా ఉంటారు. చేదు పండుగకు రావొద్దని ఉగాది పర్వదినానికి రారు.

జోరుగా పండగ సామగ్రి విక్రయాలు

ఉగాది పండగ సామగ్రి విక్రయాలతో మార్కెట్లు కిటకిటలాడాయి. మండల కేంద్రాలతోపాటు వరంగల్‌లోని ఆయా ప్రాంతాల్లో విక్రయాలు జోరందుకున్నాయి. వరంగల్‌లోని హెడ్ పోస్టాఫీస్, కాశిబుగ్గ, పోచమ్మమైదాన్, నర్సంపేట రోడ్, వరంగల్ చౌరస్తా, రామన్నపేట, ఎంజీఎం సెంటర్ తదితర ప్రాంతాలు కొత్త కుండలు, రంజన్‌ల విక్రయాలు జోరుగా సాగాయి. వరంగల్ హెడ్ పోస్టాఫీస్, చౌరస్తా ప్రాంతాలు పూల అమ్మకాలు పెద్దఎత్తున సాగాయి. ప్రధాన దారుల వెంట కొత్త చింతపండు, మామిడాకులు, మామిడికాయలు, ఇతర విక్రయాలతో సందడి సందడి మారాయి.

ఈసారి కోపతాపాలు ఎక్కువే..

డాక్టర్ సముద్రాల సుదర్శనాచార్యులు, ప్రముఖ జ్యోతిష్కుడు



కుజుడు అధిపతి కావడం శ్రీక్రోధి నామ సంవత్సరంలో కోపతాపాలు ఎక్కువే. ఈఏడు జిల్లాలో విస్తారంగా వర్షాలు కురుస్తాయి. ధాన్యం దిగుబడి అధికంగా ఉంటుంది. పాలు, వెండి, బంగారం, ఇనుము, సిమెంటు, పెట్రో, ఎలక్ట్రానిక్ వస్తువులు ధరలు పెరుగుతాయి. రియల్ ఎస్టేట్ వ్యాపారం మందగిస్తుంది. వరంగల్‌లో విమానాశ్రయం అందుబాటులోకి వస్తుంది. జిల్లాకు ఆదాయం 2, వ్యయం 8 కలుగుతుంది.

దాడికి గురైన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి


కుమార్ (ఫైల్)

వర్ధన్నపేట రూరల్, ఏప్రిల్ 8 : ఓ వ్యక్తి చేతిలో దాడికి గురై చికిత్స పొందుతూ యువకుడు మృతి చెందిన సంఘటన మండలంలోని రామవరంలో ఆదివారం రాత్రి చోటుచేసుకుంది. వర్ధన్నపేట ఎస్ఐ ప్రవీణ్‌కుమార్ కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామంలోని దురిశెట్టి కుమార్ (37) ఆటో డ్రైవర్‌గా జీవనం కొనసాగిస్తున్నాడు. వారం రోజుల కిత్రం అదే గ్రామానికి చెందిన బాలబోయిన సోమయ్య అనే వ్యక్తి తన వ్యవసాయ మోటారు రిపేరుకు రావడంతో దానిని తరలించేందుకు ఆటో కావాలని కుమార్‌ను సంప్రదించాడు. కుమార్ ప్రస్తుతం కిరాయికి రానని తెలపడంతో ఆగ్రహం వ్యక్తం చేస్తూ నీ సంగతి చూస్తానంటూ బెదిరింపులకు దిగాడు. ఈ నెల 5న గ్రామంలోని ఆటో స్టాండ్ వద్ద కుమార్ ఉండగా, తనతో కావాలని కలుగచేసుకుని వాగ్వాదం చేసి అప్పటికి తనతో తెచ్చుకున్న కర్రతో సోమయ్య దాడికి దిగాడు. కింద పడవేసి కడుపులో పిడి గుద్దులు గుద్దగా కుమార్ అపస్మారక స్థితికి చేరుకున్నాడు. వెంటనే స్థానికులు చెదరగొట్టి కుమార్‌ను జఫర్‌ఘడ్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. దాడి జరిగిన నాటి నుంచి ఆరోగ్యం బాగా లేకపోవడంతో పాటు వాంతులు చేసుకుంటున్న కుమార్‌ను ఈ నెల 7న మళ్లీ వర్ధన్నపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గం మధ్యలోనే మృతిచెందాడు. కుమార్ భార్య రాజకోమల ఆదివారం రాత్రి పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకున్న పోలీసులు, ఆ రాత్రే కుమార్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం వర్ధన్నపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతునికి భార్యతో పాటు కుమార్తె, ఇద్దరు కుమారులు ఉన్నారు.

• గ్రామంలో విచారణ..

బాలబోయిన సోమయ్య చేసిన దాడిలో మృతిచెందిన దురిశెట్టి కుమార్ మృతిపై పోలీసులు సోమవారం మండలంలోని రామవరం గ్రామంలో విచారణ చేప ట్టారు. వర్ధన్నపేట సీఐ సూర్యప్రకాష్, ఎస్ఐ ప్రవీణ్ కుమార్‌లు వారిద్దరి మధ్య జరిగిన ఘర్షణపై గ్రామ స్థులను అడిగి తెలుసుకున్నారు. వీరిద్దరికి ఏమైన పాత కక్షలు ఉన్నాయా, అనుకోకుండా జరిగిన సంఘ టనా అనే కోణాల్లో దర్యాప్తు చేస్తున్నారు. పలువురు చెప్పిన వాంగ్మూళాన్ని రికార్డు చేసుకుని వారితో సంత కాలు తీసుకున్నారు. ఫొటోలు, వీడియోలు తీసుకుని ఆధారాలు సేకరిస్తున్నారు. ఈ కార్యక్రమంలో పలువురు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ధర్మరావుపేటలో చోరీకి యత్నం

ఖానాపురం, ఏప్రిల్ 8: మండలంలోని ధర్మరావుపేటలో ఆదివారం రాత్రి రెండు ఇండ్లల్లో దొంగలు చోరీకి యత్నించినట్లు స్థానికులు తెలిపారు. ఓ ఇంట్లో ఆరుబయట నిద్రిస్తున్న ఓ వృద్ధురాలి మెడలోని బంగారం చోరీ చేయడానికి ముగ్గురు దొంగలు యత్నించగా వృద్ధురాలు కేకలు వేయడంతో చుట్టపక్కల వారు మేల్కొని రావడంతో దొంగలు అక్కడి నుంచి పరారయ్యారు. గ్రామంలోని మరో ఇంట్లో కూడా దొంగలు చోరీకి యత్నించినట్లు తెలిసింది. ఇతర రాష్ట్రాల నుంచి గ్రామంలో పనుల కోసం వచ్చిన వారే దొంగతనాన్ని యత్నించిఉండవచ్చనే అనుమానం గ్రామస్థులు వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై పోలీసులను వివరణ కోరగా గ్రామస్థుల సమాచారంతో అనుమానితుల్లో ఒకరిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు తెలిపారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాల ప్రారంభం

పర్వతగిరి, ఏప్రిల్ 8: పర్వతగిరి సొసైటీ పరిధిలోని పెద్దతండా, బూర్గుమళ్ల, నారాయణపురం, చెరువుకొమ్ము తండా గ్రామాల్లో వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను సోమవారం ప్రారంభించారు. సొసైటీ డైరెక్టర్లు దొమ్మటి లక్ష్మీనారాయణ, మల్లాడి అశోక్‌రెడ్డి మాట్లాడుతూ రైతులు దళారులను ఆశ్రయించి మోసపోకూడదని, సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన కొనుగోలు కేంద్రాల్లో విక్రయించాలని సూచించారు. కార్యక్రమంలో సొసైటీ సీఈవో సీహెచ్.సురేష్, ఏఈవో చందూలాల్, సిబ్బంది పాల్గొన్నారు.

• రాయపర్తి: రైతులు దళారులను నమ్మి మోసపోవద్దని, ధాన్యాన్ని ప్రభుత్వం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొను గోలు కేంద్రాలకే తీసుకురావాలని పీఏసీఎస్ సీఈవో సోమిరెడ్డి సూచించారు. సోమవారం మండలంలోని ఊకల్ గ్రామంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించి మాట్లాడారు. రైతులు ధాన్యాన్ని కేంద్రాలకు తీసుకువచ్చి మద్దతు ధర పొందాలన్నారు.

కూలీలకు ఓఆర్ఎస్ ప్యాకెట్ల పంపిణీ

వర్ధన్నపేట రూరల్, ఏప్రిల్ 8 : మండలంలోని ఇల్లంద గ్రామంలోని ఊర చెరువులో సాగుతున్నఉపాధి హామీ కూలీ పనులను సోమవారం గ్రామ కార్యదర్శి రామారావు సందర్శించి, కూలీలకు వేసవి కాలం సందర్భంగా ఓఆర్ఎస్ ప్యాకెట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏఎన్ఎం సరోజ, అపరంజి, ఆశ కార్యకర్తలు శోభ,కోమల, ఫీల్డ్ అసిస్టెంట్ రేణుక, సిబ్బంది రాజు, చోటే పాల్గొన్నారు.

పశు వైద్యాధికారి గుండెపోటుతో మృతి


శ్రీధర్‌రెడ్డి (ఫైల్)

రాయపర్తి, ఏప్రిల్ 8 : మండలంలోని తిర్మలాయపెల్లి గ్రామానికి చెందిన జీనుగు శ్రీధర్‌రెడ్డి(35) గుండె పోటుతో మృతిచెందిన సంఘటన సోమవారం చోటుచేసుకుంది. ములుగు జిల్లా అడవి మల్లంపల్లిలో పశువైద్యాధికారిగా పనిచేస్తున్న శ్రీధర్ రెడ్డి గుండెపోటుతో మరణించడంతో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. మృతునికి కూతురు, కుమారుడు ఉన్నారు.

వ్యవసాయ పనిముట్లు ధ్వంసం

నల్లబెల్లి, ఏప్రిల్ 8 : మండలంలోని రుద్రగూడెంలో ఆదివారం అర్ధరాత్రి గుర్తుతెలియని వ్యక్తులు వ్యవసాయ పనిముట్లను ధ్వంసం చేసిన ఘటన చోటుచేసుకుంది. బాధిత రైతు గాదె మహేందర్ కథనం ప్రకారం.. ప్రతి రోజూ లాగే ఆదివారం అర్ధరాత్రి త్రీ ఫేజ్ కరెంట్ వచ్చింది. దీంతో మహేందర్ వరి, మొక్కజొన్న పంటలకు నీళ్లు పెట్టేందుకు టార్చి లైట్ సాయంతో బావి దగ్గరికి వెళ్లాడు. కరెంట్ స్టార్టర్ ఆన్ చేద్దామని చూసేసరికి, కరెంట్ ఫేజ్ వైరు దగ్ధమై ఉంది. దీంతోపాటుగా మూడు గేట్ వాల్వ్‌లు, డ్రిప్ నీటిపైపులు, ధ్వంసమైఉన్నాయి. సోమవారం స్థానిక పోలీసుస్టేషన్‌లో రూ.30 వేలు విలువైన తన వ్యవసాయ పనిముట్లను దగ్ధం, ధ్వంసంచేసిన వ్యక్తులను త్వరగా గుర్తించి చట్టపరమైన శిక్షవేసి, తనకు న్యాయం చేయాలని ఫిర్యాదు చేసి, ఎస్సై రామారావును కోరారు.

పాఠశాలల అభివృద్ధికే కమిటీల ఏర్పాటు

దుగ్గొండి, ఏప్రిల్ 8 : పాఠశాలల మౌలిక వసతుల ఏర్పాటుకు ఆదర్శ పాఠశాలల కమిటీలను ఏర్పాటు చేసి నిధులను మంజూరుచేస్తామని ఎంపీడీవో అరుంధతి అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ఆదర్శ పాఠశాలల కమిటీల సభ్యులకు అధికారులకు అభివృద్ధి నిధులవినియోగంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఎంపీడీవో మాట్లాడుతూ పాఠశాలలకు మంజూరైన నిధులనుపాఠశాల కమిటీల తీర్మానంతో నిధులను ఖర్చు చేసుకోవాలన్నారు.సమావేశంలో ఎంఈవో సత్యనారాయణ, ఎంఎన్‌వో వెంకటేశ్వర్లు, పీఆర్ ఏఈ వెంకటేశ్వర్లు, ఏపీవో రాజ్‌కుమార్, వివిధ పాఠశాలల చైర్మన్‌లు పాల్గొన్నారు.

వైన్ షాపుల ఇష్టారాజ్యం

• బెల్టుషాపుల్లో ఫుల్.. వైన్ షాపుల్లో నిల్

పర్వతగిరి, ఏప్రిల్ 8 : మండలంలోని ఆయా గ్రామాల్లోని వైన్‌షాపుల నిర్వాహకులు ఇషారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. వైన్‌షాపుల్లో మద్యం నిల్వ ఉంచకుండా అధిక లాభాలకు ఆయా షాపుల పరిధిల్లోని బెల్టుషాపులకు విక్రయిస్తున్నారు. షాపుల్లో మద్యం లభించక బెల్టుషాపుల్లో అధిక ధరలకు కొనలేక మందుబాబులు విలవిలలాడుతున్నారు. మండలంలోని ఏనుగల్లులోని వైన్‌షాపులో మండువేసవిలో బీర్లు స్టాక్ లేకపోవడంతో నిర్వాహకులను మందుబాబులు ఆదివారం నిలదీశారు. దీంతో కస్టమర్లపై షాపు నిర్వాహకులు, సిబ్బంది ఇష్టారీతిన విరుచుకపడ్డారు. తమను పరుష పదజాలంతో దూషించారని కస్టమర్లు వాపోతున్నారు. గొడవ జరుగుతున్న విషయాన్ని పలువురు సెల్ ఫోన్లలో వీడియోతీసి సోషల్ మీడియాలో పెట్టడంతో వైరల్‌గా మారాయి. అంతేగా కుండా గ్రామంలో ఒకటే వైన్‌షాపు ఉన్నా.. మూడు పేర్లతో షాపును నిర్వహిస్తున్నారని, ఈ విషయాన్ని ఎక్సైజ్ అధికారులు సైతం పట్టించుకోవడంలేదని వాపోతున్నారు. వైన్‌షాపుల ఎదుట మందుబాబులు ఇష్టారాజ్యంగా తమ వాహనాలను పార్కింగ్ చేస్తుండడంతో గ్రామస్థులకు, వాహనదారులకు తిప్పలు తప్పడంలేదు. వెంటనే ఎక్సైజ్ అధికారులు చొరవ తీసుకుని గ్రామంలోని వైన్‌షాపుపై చర్యలు తీసుకోవాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు.

తేమ శాతం 17లోపు ఉండాలి

• జిల్లా వ్యవసాయాధికారి ఉషాదయాల్

నెక్కొండ, ఏప్రిల్ 8 : రైతులు వరి విక్రయానికి మార్కెట్‌కు తీసుకువచ్చే ధాన్యంలో తేమ శాతం లేకుండా జాగ్రత్తలను తీసుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి డి.ఉషాదయాల్ సూచించారు. సోమవారం వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రైతుల అవగాహన సదస్సులో ఆమె పలు సూచనలు చేశారు. వరి కోత సమయంలో ధాన్యంలో తేమ శాతం 23 నుంచి 26 వరకు ఉంటుందని, టార్పాలిన్ పట్టాలపై పలుచగా ఆరబెట్టిడం వల్ల తేమ శాతం తగ్గడమే కాకుండా గింజలు రంగుమారకుండా నాణ్యత ఉంటుందన్నారు. తేమ శాతం 17లోపు ఉండే విధంగా చూసుకోవాలని, మట్టి పెల్లలు, దుమ్ము , ధూళీ లేకుండా వడ్లను తూర్పర పట్టి విక్రయాలకు తీసుకురావాలన్నారు. యాసంగిలో వరి సాగులో తీసుకోవలసిన పలు రకాల సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో కన్సల్ టెంట్ జాతీయ ఆహార భద్రత మిషన్ ఉమ్మడి వరంగల్ జిల్లా అధికారి పీ. సారంగం, మండల వ్యవసాయాధికారి నాగరాజు, పీఏసీఎస్ హెడ్ సెక్రెటరీ మోడం సురేష్ , ఏఈవోలు, రైతులు పాల్గొన్నారు.

మతసామరస్యానికి ప్రతీక రంజాన్


ఇఫ్తార్ విందులో పాల్గొన్న ఎమ్మెల్యే నాగరాజు

వర్ధన్నపేట రూరల్, ఏప్రిల్ 8 : మతసామరస్యానికి ప్రతీక రంజాన్ పండుగని వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు అన్నారు. సోమవారం పట్టణంలోని జామా మసీదులో వరంగల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ వరదరాజేశ్వర్‌రావు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో ఎమ్మెల్యే నాగరాజు ముఖ్య అతిథిగా మాట్లాడారు. రంజాన్ మాసంలో ఆచరించే ప్రార్థనలు, ఉపవా సాలు క్రమశిక్షణను, ఆధ్యాత్మికతను పెంపొందిస్తుందని తెలిపారు. ఈద్-ఉల్-ఫితర్ సందర్భంగా ముస్లింలు తమ పవిత్ర ప్రార్థనలతో అల్లా దీవెనలు పొందాలని ఆకాంక్షించారు. కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ముస్లింలకు సముచితస్థానం సీఎం రేవంత్‌రెడ్డి కల్పిస్తాడని స్పష్టంచేశారు. కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ వరద రాజేశ్వర్‌రావు, నియోజకవర్గ అధికార ప్రతినిధి నిమ్మాని శేఖర్‌రావు, మండల పార్టీ అధ్యక్షుడు ఎద్దు సత్యనారాయణ, మునిసిపాలిటీ చైర్‌పర్సన్ ఆంగోతు అరుణ, కౌన్సిలర్ సమ్మెట సుధీర్, సీనియర్ నాయకులు మహ్మద్ అప్సర్, అక్బర్ పాల్గొన్నారు.

• నర్సంపేట: మతసామరస్యానికి ప్రతీక రంజాన్ పండుగని మునిసిపల్ ఫ్లోర్‌లీడర్ వేముల సాంబయ్యగౌడ్ అన్నారు. పట్టణంలోని 22వ వార్డులో గల తాజ్‌కుర్బీదా మసీదులో సోమవారం ముస్లింలకు రంజాన్ పండుగను పురస్కరించుకొని ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రంజాన్ మాసం ఆరంభంనుంచి మళ్లీ నెలవంక వచ్చేవరకు ప్రార్థనలు చేస్తూ జాగరణలు చేసి నెలవంక చూశాక రంజాన్ పండగను ఘనంగా జరుపుకుంటారని అన్నారు. కార్యక్రమంలో మోల్ సాబ్, సాహెబ్‌రాజా, ఎండి.అఖిల్‌పాషా, ముస్లిం పెద్దలు ఎండి.ఆసీఫ్, ఎండి.ఖలీల్, ఎండి.జలీల్, ఎండి.మహబూబ్ పట్టణ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు వేముల సారంగంగౌడ్, ఎన్ఎస్‌యూఐ అధ్యక్షుడు కటారి ఉత్తమ్‌కుమార్, తొగరు దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.

ముందస్తు ఉగాది వేడుకలు

చెన్నారావుపేట, ఏప్రిల్ 8 : మండల కేంద్రంలోని సిద్ధార్థ గురుకుల హై స్కూల్‌లో సోమవారం ముందస్తు ఉగాది పండుగ వేడుకలను విద్యార్థులతో కలిసి ఘనంగా నిర్వహించారు. ఉగాది పచ్చడిని తయారి చేసి విద్యార్థులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం అండెం కర్ణాకర్‌రెడ్డి, మేడి రమేష్‌గౌడ్ ఉపాధ్యాయుని. ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వయోవృద్ధుల సంక్షేమానికి చేయూతనందించాలి

చెన్నారావుపేట, ఏప్రిల్ 8: వయోవృద్ధుల సంక్షేమ కోసం ప్రతి ఒక్కరూ చేయూతను అందించాలని ఎస్సై గూడ అరుణ్‌కుమార్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని జాగృతి విద్యాని కేతన్ పాఠశాలలో రిటైర్డ్ డీఎస్పీ దమోదర్, వినియోగదారుల ఫోరం జిల్లా నాయకులు ఈగ సత్యనారాయణ ఆధ్వర్యంలో వృద్ధులకు సంక్షే సంఘం ఏర్పాటుపై అవగాహన సమావేశాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో డాక్టర్ సరోజ, నర్సింహాచారి, తాళ్లపెల్లి కొమ్మయ్య, ములుక సాంబయ్య, పత్తి సంజీవరెడ్డి, మల్లయ్య, కంది నారయణరెడ్డి, సదానందం, మాచెర్ల కోమ్మాలు, ములుక ఐలయ్య తదితరులు పాల్గొన్నారు.

మామిడిలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలి

వర్ధన్నపేట రూరల్, ఏప్రిల్ 8 : మామిడిలో రైతులు సస్యరక్షణ చర్యలు చేపట్టాలని వరంగల్ జిల్లా ఉద్యానవన అధికారి శ్రీనివాసరావు సూచించారు. సోమవారం మండలంలోని కొత్తపెల్లి గ్రామంలో బొగ్గుల సీతా మహలక్ష్మి అనే మహిళా రైతుకు చెందిన మామిడి తోటను పరిశీలించారు.